జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ బుధవారం 29 జూలై 2026 సంపుటి : 01 సంచిక :195 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం సూర్యోదయం: 5:38 । సూర్యాస్తమయం: 6:29 చంద్రోదయం: 5:41 । చంద్రాస్తమయం: 5:07 తిథి: శుద్ధ చతుర్దశి సా. 5:34 వరకు, తదుపరి పౌర్ణమి నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 1:25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ యోగం: విష్కంభం రా. 12:53 వరకు, తదుపరి ప్రీతి కరణం: వణిజ సా. 5:34 వరకు, తదుపరి భద్ర

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

- శాఖ మార్పునకు కేంద్రం ప్రతిపాదన
- ప్రచారాన్ని ఖండించిన బీజేపీ
- మొదట ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని సమాచారం
- రాజీనామా తప్ప మరో ప్రత్యామ్నాయం అంగీకరించబోమన్న సీజేపీ ప్రతినిధులు
- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇది
- ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదు



## 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

- ఆక్రమణలు, దారుణాల్ని కప్పిపుచ్చే డ్రామా'
- పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం
- పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్రమ ఆక్రమణల్ని దాచే ప్రయత్నమేనని విదేశాంగ శాఖ విమర్శలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా పాక్ ఆక్రమించిన ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం



## పనుల్లో నాసిరకం..

# బిల్లులు నిలిపివేయండి



- నాణ్యతపై నివేదిక ఆవ్వాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం
- పెదపెంకిలో అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచన.
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలి
- సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలి



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ విమర్శ
- బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది.
- "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది
- దానిని నాశనం చేయడం పాపం
- ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనంల

# వరి పంటపై తీవ్ర ప్రభావం



- ఏపీలో ఇప్పటికి 69 శాతం వర్షపాతం లోటు
- ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించండి
- సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపిన అధికారులు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు. జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం - మిగతా3లో



- ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ
- రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్‌ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్

# సెంటర్

**అమరావతి**

కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ-- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్‌ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి - మిగతా3లో



## రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి

# కాపాడుతాం

- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు
- ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం
- ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం

## జనసంద్రమైన సింహాచలం..

- వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ
- ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
- 10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. సీజేపీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్? పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్?ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చే అవకాశాన్ని ప్రభుత్వం ప్రతిపాందిచినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలు తగ్గుతాయని



కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ నుంచి బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవడమే ప్రజలకు సరైన సందేశమని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంలో కొనసాగితే ఉద్యమ లక్ష్యం నెరవేరదని, అందువల్ల రాజీనామా ఒక్కటే తమ డిమాండ్ అని చర్చల సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.

**ఉద్యమకారుల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళన**

చర్చల సందర్భంగా మంత్రివర్గంలో ఎవరు కొనసాగాలి? ఎవరికీ ఏ శాఖ కేటాయించాలన్నది పూర్తిగా ప్రధానమంత్రి అధికార పరిధిలోని అంశమని కేంద్ర ప్రతినిధులు సీజేపీకి వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ, ఉద్యమకారులు తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. శాఖ మార్పు కంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవడమే మేలని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. సీజేపీ చర్చల బృందం ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరిస్తే ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, మద్దతుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందని వారు భావించినట్లు సమాచారం. అందుకే ఎలాంటి రాజీకి వెళ్లకుండా రాజీనామా డిమాండ్‌పైనే నిలబడినట్లు తెలుస్తోంది. ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు సంకేతాలు వెళ్లకూడదనే ఉద్దేశంతో తమ వైఖరిని మార్చలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**రాజీనామా తర్వాత ముగిసిన ఆందోళన**

మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సీజేపీ తమ నిరసన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని వారాలుగా కొనసాగిన ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య ఉద్రిక్తతలు కూడా తగ్గుముఖం పట్టాయి.

**రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్**

ఈ వివాదం సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మార్చే ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ప్రతిపక్షాలు కూడా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పు సరిపోదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలకు న్యాయం జరగాలంటే మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. కేవలం శాఖను మార్చడం ద్వారా సమస్య ముగిసిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలన్నింటితో కేంద్ర ప్రభుత్వం తొలుత శాఖ మార్పు ద్వారా వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది. కానీ సీజేపీ మాత్రం పట్టుబట్టడంతో రాజీనామా తప్పలేదు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (ాశీఖ) జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కావని, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణల్ని ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు, దృష్టి మరల్చేందుకు ఆడుతున్న కపట నాటకమని భారత్ ఎండగట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ వైఖరి ఎప్పటికీ మారలేదని, అదే తమ విధానం అని పేర్కొన్నారు. పీఓకేలో ప్రజాస్వామ్యం అమలవుతోందనే భావన కల్పించడానికి మాత్రమే ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణ కొనసాగుతోందని, అక్కడి ప్రజలపై తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దారుణాల నుంచి ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఎన్నికల నిర్వహణ అని జైస్వాల్ విమర్శించారు.

'పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలు కూడా అక్కడి ప్రజల అసంతృప్తికి నిదర్శనం. పాకిస్థాన్ ఆర్థిక దోపిడీకి పాల్పడటం, ప్రజల ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, పరిపాలనా అణచివేత కారణంగానే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఎన్నికల పేరుతో ఈ వాస్తవాల్ని ప్రపంచానికి కనిపించకుండా చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది.'

**భారత నాగరిక వారసత్వంపై పాక్‌కు హక్కులేదు!**

ఈ సందర్భంగా మరోసారి సింధు జలాల ఒప్పందం అంశంపైనా స్పందించారు జైస్వాల్. ఉమ్మడి సింధు లోయ



నాగరికత తమది కూడా అని కొందరు పాకిస్థాన్ నిపుణులు చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. దశాబ్దాలుగా సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హింసకు మద్దతు ఇస్తున్న దేశానికి భారత నాగరిక, సాంస్కృతిక వారసత్వంపై హక్కు లేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని, ఆ దేశం వాస్తం స్వరూపం భారత యువతకు బాగా తెలుసని అన్నారు. భారత యువతతో పాటు కొత్త తరం కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా ముగింపు పలకాలని కోరుకుంటోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రజలు, అక్కడి నాయకత్వం కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని చురకలంటించారు.

**సార్క్ సహకారాన్ని అడ్డుకుంటుంది పాకిస్థానే!**

ఇదే సమయంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడానికి పాకిస్థానే ప్రధాన కారణమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ప్రాంతీయ సహకారాన్ని భారత్ ఎప్పటి నుంచో సమర్థిస్తోందని, అయితే సార్క్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న దేశం ఏదో దక్షిణాసియాలోని ప్రతి ఒక్కరికీ తెలుసని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల సార్క్‌ను తిరిగి చురుగ్గా మార్చాలని, సభ్య దేశాల మధ్య విభేదాల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రణధీర్ జైస్వాల్ ఇలా అన్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ దశాబ్దాలుగా నిరంతర కృషి అందిస్తోందన్నారు. సార్క్‌లో భారత్, అఫ్ఘనిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, అభివృద్ధి సహకారాన్ని పెంచే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుంది. 2014లో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన సార్క్ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా ముందుకు సాగలేదు. 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ సదస్సు కూడా రద్దయింది. ఆ ఏడాది సెప్టెంబరులో జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో భారత సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ ఆ సమావేశానికి హాజరు కాలేమని ప్రకటించింది. తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్ఘానిస్థాన్ కూడా ఇస్లామాబాద్ సమావేశాన్ని బహిష్కరించడంతో సదస్సు పూర్తిగా రద్దయింది.

# ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

"విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ యువత ఆందోళనలు చేపట్టారు. ఎంతో మంది యువతులు నిరసనల్లో పాల్గొన్నారు. కానీ, వారిని దారుణంగా కొట్టారు, చిత్రహింసలకు గురిచేశారు. బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. అత్యాచార దోషులకు రక్షణ కల్పించాలనే వాడి కంటే నైతికత లేని వ్యక్తి మరొకరు ఉండరు. ఇప్పుడు అతనే దేశ విద్యాశాఖ మంత్రి. ఈ విషయంలో ప్రధాని స్పందన చాలా వింతగా ఉంది. ఆయన కేబినెట్‌లో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరికైనా ఈ పదవికి అప్పగించిఉండొచ్చు. కానీ ఆయన మాత్రం అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ఎంచుకున్నారు."

ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందర



గోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

**మన దేశ రాజ్యాంగం గొప్పది!**

అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా చూడాలి. కానీ, అలా జరగనందువల్లే ఇటీవలి రోజుల్లో వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.


## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై–టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైపిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ–ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆరెస్సెస్ వ్యక్తికే కేంద్ర విద్యాశాఖ పగ్గాలా?

**ఎన్‌టీఏ, ఎన్ ఈపీని రద్దు వరకు ఉద్యమం**
**విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి**
**కాక్రోచ్ ఆందోళనలకు సీపీఐ సంపూర్ణ మద్దతు**
**బొద్దింకలకు భయపడుతున్న మోదీ, అమిత్‌షా**
**ఏపీలో తీవ్రమైన కరువు పరిస్థితులు**
**కరువు తీవ్రతపై సీఎం చంద్రబాబు స్పందించాలి**
**సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ**




**విజయవాడ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన తర్వాతయినా బుద్ధి రాలేదని, రాజీనామా చేసిన ఎంపీని పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యార్థి ఉద్యమాల ఒత్తిడి, దేశవ్యాప్తంగా కొనసాగిన 49 రోజుల నిరసనలు, అనేక ప్రాంతాల్లో జరిగిన పోలీసు లాఠీచార్జీలు, బలప్రయోగం అనంతరమే కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. అయితే రాజీనామా చేసిన మంత్రిని పార్లమెంట్‌లో సత్కరించడం సిగ్గుమాలిన చర్యని తూర్పారబట్టారు. ఇది విద్యార్థుల త్యాగాలను, వారి ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం అవమానించడమేనని అన్నారు. ఇంతకుముందు ఏబీవీపీగా చేసిన వారికి, ఇప్పుడు ఆరెస్సెస్‌గా పని చేసిన వారికే తిరిగి విద్యామంత్రి పీఠం కట్టబెట్టడం దుర్మార్గమని అన్నారు. మతం రంగు పులిమి విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నారని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్ర విద్యా శాఖమంత్రిగా ఎన్డీఏలోని లౌకికవాద వ్యక్తిని ఎందుకు నియమించలేదని సూటిగా ప్రశ్నించారు. విద్యార్థిని కాల్చాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యమించారని, వారిపై నమోదు చేసిన కేసులు ఇంకా తొలగించలేదని, తక్షణమే కేసులను రద్దు చేయాలన్నారు. విద్యార్థి ఉద్యమాల సందర్భంగా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను ఉపసంహరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. కేసులను తక్షణమే ఉపసంహరించి విద్యార్థులపై ఉన్న అన్ని వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే విద్యార్థి సంఘాలు తమ ఆందోళనలను మరింత విస్తృత స్థాయిలో కొనసాగిస్తాయని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలకు ప్రధాన కారణంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని, జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ ఈపీ-2020)ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ విధానం ప్రభుత్వ విద్యను బలహీనపరచి విద్యను కార్పొరేటీకరణ, వాణిజ్యీకరణ, కాషాయీకరణ దిశగా నడిపిస్తోందని విమర్శించారు. ఎన్‌టీఏ రద్దు, జాతీయ విద్యా విధానం ఉపసంహరణ జరిగే వరకు విద్యార్థి సంఘాలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ, అమిత్‌షా అన్ని పార్టీలను, చివరకు ముఖ్యమంత్రులను సైతం బెదిరించారని, ఇవాళ బొద్దింకలకు భయపడే పరిస్థితి మోదీ, అమిత్ షాలకు దాపురించిందని ఎద్దేవా చేశారు. పార్టీ నిర్మాణంపైనే సీఎం చంద్రబాబు దృష్టి పెడుతూ, ఇంటి ఇంటికి టీడీపీ అంటూ తిరుగుతున్నారని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల పైనా సీఎం స్పందించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై రామకృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో దశాబ్దాలుగా చూడని స్థాయిలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు సుమారు 54 శాతం నమోదైందని, ప్రభుత్వ గణాంకాల ప్రకారం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని వివరించారు. 608 మండలాల్లో వర్షపాతం లోటు నమోదవ్వగా, వాటిలో 249 మండలాలు తీవ్రమైన కరువు ప్రభావిత ప్రాంతాలుగా మారాయని తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో విస్తారమైన భూములు బీడుగా మారాయని, ఇప్పటికే సాగు చేసిన పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30.80 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 16.40 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయని వివరించారు. దాదాపు సగం వ్యవసాయ భూములు సాగుకు దూరమయ్యాయని తెలిపారు. రాష్ట్ర కరువు పరిస్థితులపై సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పిస్తామని రామకృష్ణ వెల్లడించారు. వర్షాలు ఆలస్యమైతే రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులను ఉచితంగా అందించాలని, కరువు నివారణ చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ కార్యక్రమాల కంటే రైతుల రక్షణ, కరువు నివారణ చర్యలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు

# ఢిల్లీ పర్యటనపై జగన్ మైండ్ గేమ్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్న ఢిల్లీ పర్యటన , ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్‌లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ చర్చలకు దారితీస్తున్నాయి. ఇంత వరకూ అపాయింట్ మెంట్ ఖరారైనట్లుగా స్పష్టత లేదు కానీ.. భేటీ ఉంటుందని వైఎస్‌ఆర్‌సీపీ వర్గాలంటున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. కేంద్ర పెద్దలకు తమపైనే ప్రత్యేక అభిమానం ఉందనే సంకేతాలను కేడర్‌లోకి పంపడంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. క్షేత్రస్థాయి ప్రచారంలో టీడీపీ, జనసేనలతో బీజేపీ, కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకుంది, కానీ మోదీ-షాలకు జగన్ అంటేనే ప్రత్యేక ఇష్టం అనే భావనను నిలబెట్టే ప్రయత్నం నిరంతరం సాగుతుంటుంది. కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు జగన్‌కు మోదీ-షాలు అపాయింట్‌మెంట్ ఇస్తే ఏపీ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది.వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని లోతుగా పరిశీలిస్తే.. ఢిల్లీలో కేంద్ర పెద్దల భేటీ లభిస్తే దాన్ని వెంటనే కూటమిపై మైండ్ గేమ్ ఆడేందుకు ఉపయోగించుకుంటుంది. తమ నేతపై కేంద్ర దర్యాప్తు సంస్థల కదలికలు మందగించడానికి, కూటమి ప్రభుత్వం పగటిపూట చేసే విచారణలకు కేంద్రం వద్ద మద్దతు లభించడం లేదని నిరూపించడానికి ఈ అపాయింట్‌మెంట్‌ను ఒక రుజువుగా చూపే అవకాశం ఉంది. జగన్ విజ్ఞప్తులను వినడానికి ప్రధాని లేదా హోంశాఖ మంత్రి సమయం కేటాయిస్తే.. చూశారా! కూటమి ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం జగన్ మాటకే ప్రాధాన్యం ఇస్తోంది అని క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేసుకోవడం ద్వారా సొంత కేడర్‌లో ధైర్యం



నూరిపోసేందుకు వైసీపీకి అవకాశం లభిస్తుంది. ఇక కూటమి పరంగా చూస్తే.. ప్రధాని లేదా హోంశాఖ మంత్రి జగన్‌కు ముఖాముఖి సమయం ఇవ్వడం కూటమి శ్రేణుల్లో సాంకేతికంగా కొంత గందరగోళాన్ని సృష్టించే ముప్పు ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ముఖ్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన చారిత్రాత్మక విజయం తర్వాత, వైసీపీ శ్రేణులకు అంతర్గతంగా పొందే ఒక నైతిక విజయం గా ఇది రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న విచారణలు, అరెస్టులపై జగన్ ఇచ్చే వినతిపత్రాలు ఢిల్లీ స్థాయిలో చర్చనీయాంశమైతే, అది కూటమి ఐక్యత , ప్రభుత్వ ఇమేజ్‌పై స్వల్ప ప్రభావం చూపవచ్చనే ఆందోళన స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంటుంది. ఢిల్లీ రాజకీయాల యంత్రాంగాన్ని డీకోడ్ చేస్తే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం నరేంద్ర మోదీ, అమిత్ షాలు అంత సులభంగా విపక్షాల ట్రాప్‌లో పడే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహకర్తగా అమిత్ షా వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ప్రాంతీయ పార్టీల అంతర్గత కలహాల్లో దూరి తమ మిత్రపక్షాలకు ఇబ్బంది కలిగించే రాజకీయాలకు వారు దూరంగా ఉంటారు. ప్రస్తుతం ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత బలమైన మెజారిటీతో, చంద్రబాబు సీఎంగా, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా సుస్థిర పాలన అందిస్తోంది. ఇటువంటి సమయంలో కూటమి ఐక్యతకు హాని కలిగించే లేదా మిత్రపక్షాల్లో అనుమానాలు రేకెత్తించే సంకేతాలను అధిష్టానం ఇవ్వాలనుకోదు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేదా మాజీ ముఖ్యమంత్రి సమయం కోరినప్పుడు, నిబంధనల ప్రకారం లేదా సాధారణ ప్రోటోకాల్ ప్రకారం వినతిపత్రాలు స్వీకరించడం కేంద్ర మంత్రుల విధి. అయితే, దాన్ని ప్రత్యేక రాజకీయ సంబంధంగా చిత్రీకరించే వైసీపీ ప్రయత్నాలను అటు బీజేపీ జాతీయ వర్గాలు కూడా గమనిస్తూనే ఉన్నాయి. అందుకే ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పటికీ, అది కేవలం ప్రజాస్వామ్యబద్ధమైన వినతుల స్వీకరణకే పరిమితమని, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేనలకు ఇచ్చే ప్రాధాన్యతలో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టమైన సంకేతాలను బీజేపీ ఇస్తోంది. మోదీ, షాలు ఇచ్చే సాధారణ అపాయింట్‌మెంట్‌ను రాజకీయ ప్రచారానికి వాడుకోవాలని చూసినప్పటికీ, అది కూటమి పునాదులను కదిలించే స్థాయికి వెళ్లకపోవచ్చని భావిస్తున్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవం, పవన్ కళ్యాణ్ బీజేపీతో కొనసాగిస్తున్న దృఢమైన బంధం ముందు జగన్ భేటీలు తాత్కాలిక సంచలనాలకే పరిమితమవుతాయి. ఎన్డీయే కూటమి తన పరిపాలనాజెండాతో ముందుకు సాగుతున్నంత కాలం, ఢిల్లీ భేటీల పేరుతో సాగే పొలిటికల్ మైండ్ గేమ్‌లు ఏపీ అసలు రాజకీయ సమీకరణాలను మార్చలేవని ఎక్కువ మంది భావిస్తున్నారు

## నిన్న కర్నూలు.. ఇవాళ చిత్తూరు
## రాయలసీమలో బంగారు గనులు

**తిరుపతి :** కర్నూలు జిల్లా జొన్నగిరిలోని బంగారు గనిలో విజయవంతంగా బంగారం ఉత్పత్తి మొదలైంది. దీంతో రాష్ట్రంలో మరో భారీ బంగారు గని అభివృద్ధికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.. చిత్తూరు జిల్లా చిగురుగుంట-బి. సానత్తం బంగారు గనులను దక్కించుకునేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఈ-వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఈ గనుల్లో సుమారు 22 లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలు ఉన్నట్లు అంచనా. మొత్తం 12,500 కిలోల వరకు బంగారం వెలికితీసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ గనులను నేరుగా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఏపీకి ఆర్థికంగా భారీగా స్థాయిలో మేలు జరిగే అవకాశాల ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.చిగురుగుంట-బి సానత్తంలో 22లక్షల టన్నుల బంగారు ఖనిజ నిల్వలున్నట్లు అధికారులు గుర్తించారు. టన్ను ఖనిజాన్ని తవ్వితీసి శుద్ధి చేస్తే సగటున 5.64గ్రాముల బంగారం వస్తుందని అంచనా వేశారు. దీంతో ఈ గని నుంచి 12,500 కిలోల బంగారాన్ని వెలికితీయొచ్చునని అధికారులు భావిస్తున్నారు ఇక్కడ గతంలో భారత్ గోల్డ్ మైన్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. 2001 సంవత్సరంలో తవ్వకాలను నిలిపివేశారు. 2018లో నిర్వహించిన ఈ-వేలంలో జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ ఎండీసీ) వీటిని దక్కించుకుంది.



అయితే, కొన్ని ఇబ్బందుల వల్ల లీజును వదలుకుంది. ప్రస్తుతం ఇక్కడి గనులకు టెండర్లు పిలిచారు. దీంతో ఏపీ ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ గనుల లీజును ఏపీఎండీసీ దక్కించుకొని బంగారం వెలికితీయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనెలాఖరు వరకు బిడ్ల దాఖలుకు అవకాశం ఉండగా.. ఈ-వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీ సిద్ధమైంది.బంగారం, బొగ్గు, బాక్సైట్ వంటి మేజర్ మినరల్స్ ను వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైనా వేలంలో పాల్గొని లీజులు పొందాల్సిందే. అయితే, ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని రెండు బొగ్గు బ్లాక్ లకు వేలం లేకుండా సింగరేణికి నేరుగా రిజర్వు చేశారు. ఒడిశాలోనూ ఓ బాక్సైట్ లీజును ఒడిశా ఖనిజాభివృద్ధి సంస్థకు కేటాయించారు. దీంతో చిగురుగుంట -బి సానత్తం గనులను వేలం లేకుండా ఏపీఎండీసీకి రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఇక్కడి మైన్స్ ద్వారా ఏపీఎండీసీకి ఆర్థికంగా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## వరి పంటపై తీవ్ర ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

నమోదుకావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించిన అధికారులు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని తెలిపిన అధికారులు. కృష్ణా, గోదావరి బేసిన్లలో ఎగువ రాష్ట్రాల నుంచి జలాలు వచ్చే అవకాశంపై సీఎం ఆరా. అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితిలు నెలకొంటాయన్న అధికారులు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందన్న అధికారులు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న అధికారులు. వంశధార నుంచి జలాలు తరలించి పంటలను కాపాడేలా ప్రయత్నించాలని సూచించిన సీఎం. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించినట్లు తెలిపిన అధికారులు. హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశం. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు తెలిపిన అధికారులు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించిన అధికారులు. వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందన్న అధికారులు. పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు వివరించిన అధికారులు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని వివరించిన అధికారులు. సమీక్షకు హాజరైన వ్యవసాయ, ఉద్యాన, హార్టికల్చర్, పశుసంవర్ధక, ఇరిగేషన్ శాఖల అధికారులు, జూమ్ ద్వారా సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు హాజరయ్యారు.

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

-మొదటిపేజీ తరువాయి

ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ-- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రెటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ , నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ , ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది. ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ జి.సాయి ప్రసాద్, ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఏ. ప్రవీణ్ రావు , స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పనుల్లో నాసిరకం.. బిల్లులు నిలిపివేయండి

**అమరావతి :** పెదపెంకి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత రోడ్ల బిల్లులు నిలిపివేయాలని ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి పెదపెంకిలో అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచన. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పెదపెంకి గ్రామంలో చేపట్టిన అభివద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పనుల బిల్లులను వెంటనే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెదపెంకి గ్రామంలో నిర్మించిన కొన్ని సిమెంట్ రోడ్లలో పగుళ్లు ఏర్పడిన విషయం ఆయన దష్టికి వచ్చింది. ఈ అంశంపై రాష్ట్ర స్థాయి చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిని పెదపెంకి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో ఐదు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. ఈ సందర్భంగా పెదపెంకిలో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపెంకిలో చేపట్టిన రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అభివద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడుతాం



**అమరావతి :** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకష్ణ రాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది.అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు.ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్--కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు .దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు,బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు,కొణతాల రామకష్ణ,గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి--16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్ కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్--కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్ లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకష్ణ, గురజాల జగన్ మోహన్,విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

# ఈ నెల 30 న చలో కలెక్టరేట్



**గుంతకల్లు జులై 28 (ప్రజా జ్యోతి):** ప్రైవేట్ యాజమానుల వద్ద పనిచేసే కార్మికులందరికీ 26000 వేతనం ఇవ్వాలని ఈనెల 30 న సిఐటియు ఆధ్వర్యంలో జరిగే అనంతపురం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నాకు కార్మికులంద రూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపా లిటీ జిల్లా నాయకులు నరసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని 66 రంగాల్లో ప్రైవేట్ యజమానుల వద్ద పనిచేసే 50 లక్షల మంది కార్మికులైన మీకు మీరు ఎన్నుకున్న ప్రభుత్వాలే అన్యాయం చేస్తున్నాయి. చట్ట ప్రకారం ఐదు సంవత్స రాలకోసారి వేతనాలు పెంచి వాటిని మీ యజమానుల చేత చెల్లింపచేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తి నట్లు కూర్చున్నాయి. 2012, 2017, 2022 సంవత్సరాల్లో చేయాల్సిన వేతనాల పెంపును చేయ కుండా యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు లాభం చేసి, మీకు నష్టం చేసింది. ఈ పాపంలో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ మరియు నేటి కూటమి ప్రభుత్వాలు వాటా లు పంచుకున్నాయి. వేతనాల పెంపు లేనందున ఇప్పటికీ హెల్పర్/ ఆఫీసుబా య్/అన్స్కిల్డ్ వర్కర్ స్థాయి లో మొన్నటి వీడీఏ తో కలిపినా నెలకు రూ. 12 వేలు-రూ.13 వేల మధ్యలో నే కనీస వేతనం వేలాడుతు న్నది. గడువు మీరగానే అప్పటికి ఉన్న వీడీఏ ను బేసిక్ వేతనంలో కలిపి, ఆ మొత్తం మీద 15 లేదా 20 శాతం చొప్పున వేతనాలు పెంచి ఉన్నట్లయితే ఆ వేతనం కనీసం ఈ పాటికి రూ.19 వేల నుండి రూ.22 వేల వరకు వచ్చేది. యాజ మాన్యాలు, కార్మిక సంఘా లు, ప్రభుత్వాలు భాగస్వా ములుగా ఉన్న 15వ భారత కార్మిక మహాసభ 1957లోనే తిండి, బట్ట, ఇంటి అద్దెలు, రవాణా, కరెంటు ఖర్చులకు సరిపడా కనీస వేతనం ఉండాలని తీర్మానించింది. దీనికి సిఐటియు డిమాండ్ చేస్తున్నది. అదనంగా కనీస వేతనంలో 25 శాతం చదువులు, ఆరోగ్యాలు, వినోదాలు, పండుగలకు ఉండాలని 1992లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వీటన్నింటిని కలుపుకుంటే నేటి ధరల్లో కనీస స్థాయి కార్మికునికి నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నాది. ప్రభుత్వంతో పాటు యజమానులు కూడా మిమ్మల్ని మోసం చేస్తున్నా రు. 6 నెలలకోసారి ధరల పెరుగుదల్లో కొంత భాగాన్ని భర్తీ చేసే వీడీఏను ఇవ్వకుం డా, 8 గంటలు మించి చేసి న పనికి చట్ట ప్రకారం డబు ల్ వేతనాలు ఇవ్వకుండా, సంవత్సరానికి ఇంత అని ఇంక్రిమెంట్ పేరుతో మీ జోలిలో వేస్తున్నారు. లేబర్ అధికారులు తనిఖీలకు పోకుండా ప్రభుత్వం కట్టడి చేసింది యాజమాన్లు ఆడిందే ఆట అవుతున్నది దీన్ని మరింతకాలం సాగు ను ఇవ్వకూడదు. వేతనాల పెంపు కోసం పోరాడండి జూలై 30న వేతన పెంపుకై కలెక్టరేట్ వద్దకు కదలిరండి. సిఐటియు గా మీకు మేము అండగా నిలబడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిఐటియు అధ్యక్షుడు జగదీష్, తిమ్మప్ప, రంగనాయకులు, దాసు ,సామెల్, కృష్ణ, నారాయణస్వామి, రవి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



**డోన్ (ప్రజా జ్యోతి) జులై 28** నంద్యాల జిల్లా అడిషనల్ఎస్పీ ఖాదర్ బాషా సోమవారండోన్ టౌన్ పోలీస్ స్టేషనను అకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో తన చిన్ననాటి స్నేహితులు తెలుగుదేశం పార్టీ నాయకుడు డోన్ 32 వ వార్డు ఇంచార్జి ధనంజయ, ఆయన మిత్రులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పం గుచ్చం ఇచ్చి తమచిన్ననాటి స్నేహం తీపి గుర్తులు జ్ఞాపకం చేసుకుంటూ ముచ్చటించుకున్నారు, మా మిత్రుడు అడిషనల్ ఎస్పీ పోలీస్ఆఫీసర్ అయినందుకు మేమందరం గర్వపడుతున్నాం ఆనంద పడుతున్నాము అని తెలిపారు ,

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల విశేష ఆదరణ

### రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమంపై డోర్ టు డోర్ ప్రచారం



రెండేళ్ల పాలనపై కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

**ఎటపాక, జూలై 28 (ప్రజాజ్యోతి):**ఎటపాక మండలంలోని గన్నవరం, లక్ష్మీపురం, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలలో "ఇంటింటికి తెలుగుదేశం" డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర తెలుగు దేశం పార్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రంప చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నా యని తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించ డంతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకు న్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి రమేష్, ఉండేటి వెంకన్న, కొట్టే రవీంద్ర, కొట్టే ఏసులు, గార్లపాటి శ్రీను, గార్లపాటి శేఖర్, పుట్టి అప్పారావు, పేరా వెంకన్న, పనితి దానియేలు, చేకూరి రామకృష్ణ పనితి ప్రదీప్, ఏసుపాక బాలాజీ, దాసరి పెద్దబాబు, శ్రీకాంత్, సందీప్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కమిషనర్‌కు అభివృద్ధి పనులు వివరించిన కలెక్టర్



**బాపట్ల జూలై 28 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఏపీ గ్రామీణ అభివృద్ధి సంస్థ కమిషనర్ ఆర్. ముత్యాలరాజు మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించారు. స్థానిక కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి మొక్కను అందజేశారు. అనంతరం కమిషనర్ కలెక్టర్ కార్యాలయం, కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ ఆయనకు వివరించారు. ముఖ్యంగా సూర్యలంక బీచ్ అభివృద్ధి పనుల పురోగతిని వివరించడంతో పాటు, జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి సంక్షిప్తంగా అవగాహన కల్పించారు.

## అధికారులకు నాణ్యమైన శిక్షణే లక్ష్యం

- కమిషనర్ ముత్యాలరాజు



**బాపట్ల జూలై 28 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఏపీ ఎస్ఐఆర్డీ, పీఆర్ కమిషనర్ ఆర్. ముత్యాలరాజు అధ్యక్షతన మంగళవారం బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో మేనేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2025--26 వార్షిక ప్రణాళికలో భాగంగా 3,676 మంది వివిధ స్థాయి అధికారులకు శిక్షణ అందించగా, 2026, 27లో ఇప్పటివరకు 870 మందికి శిక్షణ ఇచ్చినట్లు సమీక్షించారు. గత ఏడాదికంటే ఎక్కువ మంది అధికారులు, ప్రజాప్రతినిధులకు నాణ్యమైన శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వచ్చే మూడు నెలల్లో పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్ర శిక్షణ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏపీ ఎస్ఐఆర్డీ--పీఆర్ అదనపు డైరెక్టర్ కె.ఎస్. వరప్రసాద్, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డి. వెంకట్రావు, వైస్ ప్రిన్సిపల్ పి. పద్మజ, గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి. జ్యోతిబసు, బాపట్ల డివిజనల్ అభివృద్ధి అధికారి సి.హెచ్. విజయలక్ష్మి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కె.ఎల్. ప్రభాకరరావు పాల్గొన్నారు.

# చెన్నూరు కు చెందినడాక్టర్ తప్పెట నీల్ రోహిత్ రెడ్డి కి అమెరికా తెలుగు సంఘం (ఆటా) సభలకు ఆహ్వానం





**చెన్నూరు, జులై,28,** చెన్నూరు గ్రామానికి చెందిన ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి ఆచార్య రమాదేవి ఇరువురు యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి.ఎం బి బిస్. పూర్తి చేసిన తర్వాత ఎమర్జెన్సీ మెడిసిన్ లో పి.జి పూర్తి చేశారు .ఆ తర్వాత లండన్ లో వైమానిక అత్యవసర వైద్యం లో ఫెలోషిప్ చేశారు.గత ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్ లో వివిధ ఆసుపత్రులలో పనిచేస్తూ రోగులకు అత్యవసర చికిత్స చేస్తున్నారు.కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో అనేక మంది ప్రాణాలు కాపాడారు. ఆ తర్వాత అత్యవసర పరిస్థితుల్లో రోగులను విమానం ద్వారా ఆసుపత్రులకు సురక్షితంగా తరలించే శిక్షణను లండన్ లో తీసుకున్నారు. హెలికాప్టర్, విమానాల ద్వారా ప్రాణాపాయం లో ఉన్న వారిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించి వైద్యం లో నైపుణ్యం సంపాదించారు. ఐ సి ఏ టి టి, అనే సంస్థ లో 3సంవత్సరాలు పనిచేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉచితంగా అత్యవసర వైద్యం కోసం రోగులను హాస్పిటల్ కు విమానంలో,హెలికాప్టర్లలో తరలించే పథకం ప్రారంభించింది.డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి భోపాల్ లో పనిచేస్తున్న సమయంలో మొట్టమొదటిసారిగా ఈ పథకం ద్వారా పేషెంటును సురక్షితంగా విమానంలో తరలించే సమయంలో రోగికి ఎలాంటి ప్రాణాపాయం కలగకుండా అందుబాటులో ఉండి ఎయిర్ అంబులెన్స్‌లో వైద్యం అందించారు ఆ తరువాత హైదరాబాద్ నుంచి భారతదేశంలోని వివిధ ఆసుపత్రులకు మరియు వివిధ దేశాలకు రోగులను తరలించే సమయంలో ఎయిర్ అంబులెన్స్ లో డాక్టర్ గా పనిచేస్తు సేవలందించారు.అనేక మంది నిరుపేద రోగులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందించారు.ప్రస్తుతం రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ అనే సంస్థ ను స్వయంగా స్థాపించారు.ఈ సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా రోగులను విమానాల్లో,హెలికాప్టర్ లో అత్యవసర సమయాల్లో వివిధ ఆసుపత్రులకు తరలించే సమయంలో అందుబాటులో ఉంటూ ప్రాణాలను కాపాడటం లో సహాయం చేస్తున్నారు. డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి ఇప్పటికే 32 దేశాలకు పైగా రోగులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించే సమయంలో అందుబాటులో ఉన్నారు. వీరి సేవలను గుర్తించిన ఏ టి ఏ కాన్ఫరెన్స్ ఈనెల 31 నుంచి ఆగస్టు 2 తేదీ వరకు యు ఎస్ ఏ లో జరిగే సమావేశాలకు అక్కడి నిర్వాహకులు ఆహ్వానం అందించారు. వారి ఆహ్వానం మేరకు డాక్టర్ నిల్ రోహిత్ రెడ్డి 28న మంగళవారం అమెరికా కు బయలుదేరారు.ఆ సభల్లో భారతదేశం లో ఎయిర్ అంబులెన్స్ సేవల గురించి వివరించడానికి ఒక ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు అనుమతించారు.

## గుత్తి--గుంతకల్లు తారు రోడ్డు పనులను పరిశీలించిన: గుమ్మనూరు నారాయణస్వామి



**గుంతకల్లు జులై 28 (ప్రజా జ్యోతి):** గుత్తి నుండి గుంతకల్లు వరకు ఎన్‌హెచ్--64 హైవేకు అనుసంధానమయ్యే అప్రోచ్ రోడ్డులోని గుత్తి చెరువు రోడ్, రాజాపురం గ్రామం, పాత కొత్త చెరువు గ్రామం, తిమ్మాపురం గ్రామం మీదుగా గుంతకల్లు పట్టణం లోని పాత గుంతకల్లు, హనుమాన్ సర్కిల్ మీదుగా బళ్లారి రోడ్డు వరకు నిర్మాణం జరుగుతున్న తారు రోడ్డు పనులను గుంతకల్లు టిడిపి మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి మంగళవారం గుంతకల్లు పట్టణ ప్రవేశ ద్వారం వద్ద జానకమ్మ హోటల్ సమీపంలో జరుగుతున్న పనులను అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించి పనుల పురోగతి ని అడిగి తెలుసుకున్నారు. సుమారు ?30 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ తారు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతు న్నాయని, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యా యని తెలిపారు. ప్రస్తుతం గుంతకల్లు పట్టణ పరిధిలో మిగిలిన పనులు కూడా కొద్ది రోజుల్లో పూర్తవుతా యని చెప్పారు. గుత్తి నుండి గుంతకల్లు, బళ్లారి వైపు వెళ్లే వాహనాలకు, అలాగే మధ్యలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించే బస్సులు, ఇతర వాహనా లకు ఈ రహదారి ప్రధాన మార్గమని పేర్కొన్నారు. రోడ్డు పూర్తయిన తర్వాత ప్రయాణం మరింత సులభం గా, వేగవంతంగా మారి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అంతేకాకుండా ఈ రహదారి గతంలో దెబ్బతిని గుంతల మయంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులతో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత వేలాది మంది ప్రజలు, వాహనదా రులు సురక్షితంగా ప్రయా ణించడంతో పాటు, గతంలో గంట సమయం పట్టే ప్రయాణం ఇప్పుడు సుమారు అరగంటలోనే పూర్తయ్యే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

# డోన్,మాలిక్ బాబా భజన మండలి హార్మోనిస్ట్ పీజీ సుబ్బరాయుడుకుసన్మానం



**డోన్ ప్రజా జ్యోతి జూలై 28** నంద్యాల జిల్లా డోన్ టౌన్ కొండపేటరేణుక ఎల్లమాంబేశ్వరి దేవాలయ సేవకులకు డోన్ డిఎస్పి శ్రీనివాసులుఘనంగా సన్మానించి మెమొంటోస్ అందజేశారు,సన్మాన గ్రహీతలు డోన్ మాలిక్ బాబా సంస్థాన్ భజన మండలి అధ్యక్షులు ప్రముఖ హార్మోనిస్టు పీజీ సుబ్బరాయుడు, వంట మాస్టర్ గోసాని పల్లిదేవి తెలుగు రాంబాబు మాలిక్ బాబా సమస్తాన్ కోశాధికారి సురేషు, మల్కాపురం పూజారి గార్లపాటి హరిజననాగన్న, కొండపేట రేణుక ఎల్లమ్మేశ్వరి దేవాలయ ప్రధాన సేవకులు ఏఈ నాగ రాజుకు, డోన్,డి.ఎస్.పి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి మెమొంటో అందజేయడం జరిగినది ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ దొంగలను, రౌడీలను, ముటా కక్షలను, అసాంఘిక కార్యక్రమాలను పోలీసులు కట్టడి చేస్తే కలరా మలేరియా ఇతర క్షుద్ర శక్తులను గ్రామంలోకి రాకుండా గ్రామదేవతలు పహారాకాస్తారని అటువంటి గ్రామ దేవతలను భజన ద్వారా చైతన్యం చేస్తున్న హార్మోనిస్టు సుబ్బరాయుడు మరియు ఇతర కళాకారులను సన్మానించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు, కొండ పేటలో మూడు రోజులపాటు శ్రీ రేణుక ఎల్లమాంబేశ్వరి జ్యోతిర్లింగేశ్వర స్వామి 20వ వార్షికోత్సవ సందర్భముగా ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేసినందుకుఏఈ నాగరాజుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు దేవాలయ, భజన మండలిలకు తన వంతు సహకారం అందిస్తానని డిఎస్పి తెలియజేశారు ఈ సందర్భంగా ఏఈనాగరాజు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి సుబ్బరాయుడు మాస్టర్ అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలకు మూడు రోజులపాటు ప్రతి సంవత్సరం స్వచ్ఛందంగా భజన కార్యక్రమాలు, నిర్వహిస్తున్నారని గత సంవత్సరాల నుండి భోజనం, ప్రసాదాలు రాంబాబు ఉచితంగా వంటలు తయారు చేస్తున్నారని, సేవా కార్యక్రమాలకు కటిక సురేష్ రావు, మల్కాపురం నాగన్న అదేవిధంగా మాలిక్ బాబా సంస్థానమునకు గత సంవత్సరాలుగా భజన కార్యక్రమాలు ఆలపిస్తూ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న సుబ్బరాయుడు సారుకు, డిఎస్పి శ్రీనివాసులు సన్మానించడం రాజ కిరీటంతో అలంకరింపజేసి, అభినందించడం చాలా ఆనందంగా ఉందని,డీఎస్పీ శ్రీనివాసులు కు, జ్యోతిర్లింగేశ్వర స్వామి దేవస్థానం వారు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాము,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెక్కభజన మండలి అధ్యక్షులు శ్రీ రాంపల్లి శ్రీనివాసులు, విద్యాలయాల ధర్మకర్త కృష్ణాపురం కాల్వ ఓంనారాయణ, ఆల శ్రీరాములు,తదితరులు పాల్గొన్నారు,

## కోటికె హరికృష్ణపుట్టినరోజు



**డోన్ ప్రజా జ్యోతి, జూలై 28** నంద్యాల జిల్లా డోన్ లో మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కోటికె హరికృష్ణకుమంగళవారం డోన్ పాత పేటలో నివాసం వద్ద పుట్టినరోజు వేడుకల సందర్భంగాముఖ్యుడు అయినా, ఎద్దుపెంటవెంకటేష్ (డీలర్) శాలువాకప్పి ,పూలమాలవేసి, కేక్ తినిపిస్తూ, నీకు ఎన్నో ఉన్నత పదవులు రావాలని దేవుని కోరుకుంటున్నాను,అని ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, అదేవిధంగా అభిమానులు శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శుభాకాంక్షలు తెలిపారు,

## సోకులేరు వ్యూ పాయింట్‌లో విషాదం.. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులు

**స్నేహితుడిని కాపాడబోయి మరో యువకుడు కూడా గల్లంతు --**

**మోతుగూడెం పోలీసులు, ఏఎన్ఎస్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల ముమ్మర గాలింపు**



**మోతుగూడెం, జూలై 28: ప్రజా జ్యోతి** చింతూరు మండలం చడలవాడ పంచాయతీ పరిధిలోని తులసిపాక గ్రామ సమీపంలోని సోకులేరు వ్యూ పాయింట్ వద్ద మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు విహారయాత్రకు వెళ్లగా, వారిలో పెండెం బాబీ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు పెండెం కళ్యాణ్ నీటిలోకి దిగగా, అధిక నీటి ప్రవాహంలో ఇద్దరూ కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. గోపాలకృష్ణ, మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్, ఏఎన్ఎస్ బృందం, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన ఇద్దరి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, తదుపరి వివరాలను అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## గొల్లప్రోలులో యువతి అనుమానాస్పద మృతి



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో నివాసముంటున్న తండి ప్రిస్కిల్లా (27) అనే యువతి మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రిస్కిల్లా, కాకినాడలోని ఎస్ఆర్ఎంటి మాల్‌లో గల రిలయన్స్ డిజిటల్ విభాగంలో బజాజ్ ఫైనాన్స్ సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది.మంగళవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని వాతావరణం చూసి, ఆమె చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతురాలి తండ్రి పేరు పీతాంబర్. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ నౌడ్ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా భావిస్తూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి తల్లి తల్లికి వందనం పథకం లబ్ధితో సంతోషాన్ని వ్యక్తం చేస్తుంది...

**మంత్రాలయం ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి,జనసేన ఇంచార్జీ లక్ష్మణ్,బిజెపి ఇంచార్జీ విష్ణువర్ధన్ రెడ్డి**

**:-ఎన్టీఆర్ బరోసా పింఛన్ తో అవ్వ తాతలు జీవనం మెరుగుపడిందని ధైర్యం చెప్తుంది...జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య**

**:-ప్రతి పల్లె ప్రగతి పథంలో నడుస్తుంది...మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు, యువ నాయకులు రాజారెడ్డి..**

**:-2వ రోజు కౌతాళం మండలం దమ్ములదిన్నె గ్రామం నందు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం..**



**కౌతాళం, జులై 28 ప్రజా జ్యోతి** మంగళవారం రోజున కౌతాళం మండలం నందు దమ్ములదిన్నె గ్రామం నందు కూటమి పార్టీ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు అధ్యక్షతన ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామం నందు ప్రతి కుటుంబ సభ్యుడిని పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ లబ్ధిని గ్రామ అభివృద్ధికి అందిస్తున్న ప్రగతిని చెబుతూ,గ్రామం నందు ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకొని త్వరగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమములో క్లస్టర్ యూనిట్ ఇంచార్జీలు అడివప్ప గౌడ్,వెంకటపతిరాజు,చంద్రన్న, అంబరేష్,రామలింగ,కురువ వీరేష్,సౌద్రి బసవరాజు,పట్టాభి,లక్కే గోవిందు,శివ మూర్తి నాగిరెడ్డి, తెలుగు రైతు అధ్యక్షులు గిరి, రమేష్,హనుమంతు,వీరేష్,సోమేశ్, మహంతేశ్,గ్రామ నాయకులు షేక్షావలి,ఉసేని, నాగరాజు గౌడ్,భారత్,ముదుకప్ప వీరేష్ నాయక్,వెంకటేష్,మారెప్ప,ఉమాపతి, మహాదేవ, అయ్యప్ప,గట్టురు ఉసేని,కృష్ణ, కాకమ్ రామాంజినేయులు మొదలగు వారు పాల్గొనడం జరిగినది.

# గంజాయి కేసులో నలుగురు అరెస్ట్

## 190 గ్రాముల గంజాయి, స్కూటర్, నాలుగు ఫోన్లు స్వాధీనం



**బాపట్ల జులై 28 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు వెదుళ్లపల్లి పోలీసులు నిర్వహించిన దాడిలో నలుగురు నిందితులు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి 190 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, టీవీఎస్ జూపిటర్ స్కూటర్, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను బాపట్ల రూరల్ సీఐ బి. హరికృష్ణ సోమవారం వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. ఈ నెల 26న వెదుళ్లపల్లి గ్రామంలోని వడ్డెరపాలెం ఎదురుగా ఉన్న హిందూ శ్మశానవాటిక వద్ద కొందరు గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేరం సాయిచంద్, దేవరకొండ హేమంత్ కుమార్, రావినూతల అచ్యుత్ సాయికుమార్‌లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు వెదుళ్లపల్లికి చెందిన దేవి ఏడుకొండల రెడ్డి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకోవడంతో అతడిని కూడా అరెస్టు చేశారు.నిందితుల వద్ద నుంచి మొత్తం 190 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.600 నగదు, టీవీఎస్ జూపిటర్ స్కూటర్‌ను స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అరెస్టైన వారిలో పేరం సాయిచంద్‌పై నాలుగు, దేవరకొండ హేమంత్ కుమార్‌పై 11, రావినూతల అచ్యుత్ సాయికుమార్‌పై రెండు కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు.ఈ కేసును ఛేదించిన వెదుళ్లపల్లి ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు తిరుపతిరాజు, అంకయ్య, కానిస్టేబుళ్లు రమేష్, రాజేష్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఫేక్ పార్టీ టిడిపి.. వైసిపి కాదు.. టిడిపి డిఎన్ఏ ఏంటో లోకేష్ నిజం తెలుసుకోవాలి..

**ఇంటింటికి వెళ్లాలంటే జంకుతోన్న సైకిల్ పార్టీ నేతలు..**

**రెండేళ్లలో ఏం చేసారని ప్రజలు ప్రశ్నిస్తారన్న భయంలో తెలుగు తమ్ముళ్లు..**

**ఫేక్ పార్టీ వైసిపి కాదు.. టిడిపి అంటూ ధ్వజమెత్తిన జమ్మలమడక..**



**కాకినాడ జూలై 28 :(ప్రజా జ్యోతి)** విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ గురువింద కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి లోకేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ పార్టీ అని, రాంగ్ డిఎన్ఏ అని మాట్లాడే ముందు నారా లోకేష్ తన తండ్రి చంద్రబాబు నుంచి ఒక నిజం తెలుసుకోవాలని సూచించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీని ఎలా కబళించారో తెలుగు ప్రజలందరికి తెలిసినా లోకేష్ కు అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కాంక్షించి పార్టీని స్థాపించారని తెలిపారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని దొడ్డి దారిన చేజిక్కుంచున్న వాళ్లు ఫేక్ పార్టీ, తప్పుడు డిఎన్ఏ అవుతారా. లేక సొంత బలంతో పార్టీని స్థాపించిన వారు అవుతారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తాజాగా ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు ఇంటింటికి తెలుగుదేశం అంటూ కొత్త డ్రామాకు చంద్రబాబు, లోకేష్ తెర తీసారని మండిపడ్డారు. అయితే ఈ పరిణామంతో రాష్ట్రంలో తెలుగు తమ్ముళ్లు కక్కలేక మింగలేక ఉన్నారని ప్రజల వద్దకు ఏ ధైర్యంతో వెళ్లాలా అన్న ఆందోళనలో ఉన్నారని ఎద్దేవా చేసారు. వైసిపి అధినేత జగన్ ఇచ్చిన హామీలను కాపీ కొట్టినా వాటిని ఆ స్థాయిలో అమలు చేయలేకపోతున్నారని మండిపడ్డారు. రెండేళ్లలో రెండు ఉచిత సిలిండర్లు ఇచ్చి మహిళలను దారణంగా మోసం చేసారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైయ్యి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం దారుణమన్నారు. ఇంటింటికి మోసాన్ని, అబద్ధాన్ని పంచిన చంద్రబాబు ప్రభుత్వం, సూపర్ సిక్స్ పేరిట చేతకాని హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఇక ఆడబిడ్డ నిధులు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో కూడా స్పష్టత లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీల తాలుకా బకాయిలు సుమారుగా రూ. 2 లక్షల కోట్లుగా ఉన్నాయన్నారు. రైతులకు అన్నదాత నిధులు, ఉద్యోగుల పిఆర్సీ, ఐఆర్, పెండింగ్ డిఏల ఊసే ఎత్తడం లేదన్నారు. నిరద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలంటూ ఆశలు కల్పించి ఇప్పటి వరకు ఈ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు.. చంద్రబాబు గత ప్రభుత్వాల హాయాంలో సుమారు ఆరుసార్లు పరీక్ష పత్రాల లీకేజ్ ఘటనలు జరగాయని గుర్తు చేసారు. స్కూళ్లతో పాటు రాష్ట్రంలో చిన్న మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ఇలా అన్ని రంగాలను తిరోగమనం దిశగా దిగజారుస్తున్నారని మండిపడ్డారు. తప్పులు చేసుకుంటూ పోతున్న చంద్రబాబు లోకేష్‌లు ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను సరిదిద్దుకోవాలని నాగమణి హితవు పలికారు..

## బీజేపీ ఏపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ



**కాకినాడ (ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర కార్యాలయం, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర స్థాయి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ నుండి వేలాది మంది ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆయన స్వగ్రామమైన పెద్దాడ మీదుగా కొనసాగింది. అక్కడ తన తల్లి మరియు అత్తగారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.అనంతరం ర్యాలీ ఆయన స్వగ్రామమైన రాజుపాలెం చేరుకోగా, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ భారీ ర్యాలీ విజయవంతంగా కొనసాగింది. అనంతరం రాజుపాలెంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మైనారిటీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈసందర్భంగా భారీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# పేదలకు అండగా సి ఎం సహాయనిధి

**ఆలూరులో 90 మంది లబ్ధిదారులకు రూ.36 లక్షల సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి**



**ఆలూరు/హోళగుంద, జూలై 28, ప్రజా జ్యోతి న్యూస్ –** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పెద్ద దిక్కుగా నిలుస్తోందని ఆలూరు టిడిపి ఇన్‌చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి తెలిపారు. మంగళవారం ఆలూరులోని తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరవ విడతగా ఎంపికైన 90 మంది లబ్ధిదారులకు రూ.36 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆమె చేతుల మీదుగా అంద జేశారు.ఈ సందర్భంగా శ్రీమతి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ... ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడమే తెలుగుదేశం పార్టీ నైజమని పేర్కొ న్నారు. సీఎం సహాయ నిధి ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సాయం తీవ్రఆరోగ్య సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, ఎటువంటి పక్షపాతం లేకుండా సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని స్పష్టం చేశా రు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి కు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు లబ్ధిదారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా... ఏలేరు సాగునీటి విడుదలపై కీలక నిర్ణయం!






**కాకినాడ కలెక్టరేట్(ప్రజా జ్యోతి)** నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో, జిల్లా సాగునీటి సలహా సంఘం (ఐఏబీ) చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా సాగునీటి సలహా సంఘం సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ జనసేన పార్టీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఇరిగేషన్ ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మొరాలశెట్టి సునీల్ కుమార్ ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు పిఠాపురం జనసేన ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు శ్రీ ఓదూరి కిషోర్ ఏలేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ వూటా ఆది విష్ణు (నానిబాబు) ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వర రావు ఎస్ఈ శ్రీనివాసరావు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ఏలేరు ప్రాజెక్టు నుండి సాగునీటి సరఫరా అంశంపై ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతు ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకొని, మెట్ట ప్రాంతాల్లోనే సాగునీటిని అడ్డుకోకుండా, చివరి ఆయకట్టు భూముల వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరడం జరిగింది.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తొలకరి సాగుకు ఏలేరు ప్రాజెక్టు నుండి సాగునీటిని విడుదల చేయడంపై సమగ్రంగా చర్చించారు. ఈ విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులు సానుకూలంగా స్పందించి, ఆయకట్టు రైతులకు 1,000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకోవడం రైతాంగానికి ఎంతో ఊరటనిచ్చే పరిణామం.ఈ సందర్భంగా పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్ ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ పిఠాపురం మండల జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వెన్నా జగదీష్ అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంజి గోవిందరాజు తోలేటి శిరీష అడపా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: కమిషనర్ ఆదేశాలు

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ దివిజ సంపతి సానిటరీ సెక్రటరీలను ఆదేశించారు.

వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ప్రధాన, అంతర్గత డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలి.దోమల వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలి.

పట్టణంలో పారిశుధ్య పనితీరును మరింత మెరుగుపరిచేందుకు వార్డు సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి.









**కాకినాడ జిల్లా గొల్లప్రోలు(ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతగా మున్సిపల్ యంత్రాంగం పనిచేయాలని గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సానిటరీ, ఎమినిటీస్ సెక్రటరీలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య పనితీరు, వీధి దీపాల నిర్వహణపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించని పక్షంలో, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ఆమె గట్టిగా హెచ్చరించారు.

డ్రైనేజీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: కమిషనర్

**ఆదేశాలు**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ దివిజ సంపతి సానిటరీ సెక్రటరీలను ఆదేశించారు.వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ప్రధాన, అంతర్గత డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలి.దోమల వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలి.పట్టణంలో పారిశుధ్య పనితీరును మరింత మెరుగుపరిచేందుకు వార్డు సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి అన్ని సూచించారు.

**వీధి దీపాల సమస్యలపై తక్షణ స్పందన**

పట్టణంలోని పలు వార్డులలో వీధి దీపాల సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై కమిషనర్ తీవ్రంగా స్పందించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను ఎమినిటీస్ సెక్రటరీలు వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకువెళ్లి, 24 గంటల్లోగా పరిష్కరించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**16, 17 వార్డులలో ఆకస్మిక తనిఖీలు**

సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి అధికారులతో కలిసి పట్టణంలోని 16, 17 వార్డులలో ఆకస్మికంగా పర్యటించారు. అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులను, వీధి దీపాల పనితీరును ఆమె స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల్లో నిమగ్నమైన పారిశుధ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సిబ్బంది రక్షణ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. డ్రైనేజీల శుభ్రత మరియు ఇతర ప్రమాదకర పనులు చేసేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా గ్లోవ్స్, మాస్కులు, గం బూట్లు వంటి సేఫ్టీ మెజర్స్ ధరించాలని ఆమె సూచించారు.ఈ విస్తృత స్థాయి సమీక్ష మరియు క్షేత్రస్థాయి పర్యటనలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎండి అలీషా, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ కె. రఘుప్రసాద్, ఆయా వార్డుల సెక్రటరీలు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలి

- 9 వ రోజు కొనసాగిన దస్తావేజు లేఖర్ల నిరవధిక సమ్మె
- తమ సమస్యను పరిష్కరించాలంటూ డిమాండ్
- ప్రభుత్వం జీవో 396 ను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- జిల్లా దస్తావేజు లేఖర్లు సంఘం కార్యదర్శి బలివాడ సత్యన్నారాయణ

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** దస్తావేజు లేఖర్లు చేపట్టిన నిరవధిక సమ్మె 9 వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు పొందూరు మండల కేంద్రంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 396 వల్ల దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న దస్తావేజు లేఖర్ల జీవనోపాధి తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. ఈ జీవో అమలు లోకి వస్తే వేలాది మంది దస్తావేజు లేఖర్లు ,వారి కుటుంబాలు ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రైవేటీకరణ చేయడం వలన పారదర్శకత దెబ్బతింటుందన్నారు. ఎన్ని ఏళ్ళుగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందిస్తున్న దస్తావేజ్ లేఖర్లకు అన్యాయం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. భూములు ఆస్తులకు సంబంధించిన అత్యంత కీలకమైన రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం సమంజసం కాదన్నారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో 396 ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూర శ్యామల రావు కాపల ప్రసాద్ మాడుగుల రవికుమార్ కాపల శ్రీను వాండ్రంగి శ్రీనివాస్ పట్నాయక్ బలివాడ కృష్ణ అశోక్ పట్నాయక్ తూతిక కామరాజు చిత్తిరి గోవింద రావు జాడ మురళీ రాంబాబు ,వి తవిటి నాయుడు జిల్లా దస్తావేజు లేఖర్లు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## పెద్దార్కుర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు..

ప్రోటోకాల్ ఉల్లంఘన, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం.... జిల్లా కలెక్టర్ కు ఎంపీటీసీ దర్మల అమ్మాజీ, మాజీ సర్పంచ్ మడకం నాగమణి వినతి పత్రం, ..





**కూనవరం జులై 28 ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం పెద్దార్కుర్ గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల అమలులో అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరిగాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ దర్మల అమ్మాజీ, మాజీ సర్పంచ్ మడకం నాగమణి, గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాధరావు ఒత్తిడితో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని వినతిపత్రంలో ఆరోపించారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు మే నెలలో గండి కొత్తగూడెంలో నాలుగు వారాల పాటు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు స్వీకరించినప్పటికీ, ఇప్పటివరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. తాగునీటి హ్యాండ్‌బోర్లు ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొత్త ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు వంటి కీలక సమస్యలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కోరారు.

## కొరసవాడగ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఇంటింటి (డోర్ టు డోర్) కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నం నియోజకవర్గం,పాతపట్నం మండలం, కొరస వాడ గ్రామ పంచాయతీ 44 బూత్ లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన, సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికీ డోర్ టు డోర్ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు మరియు భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాల గురించి ప్రజలకు వివరించారు.ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబా నికి చేరేలా ప్రజలతో నేరుగా మమేకమై అవగాహన కల్పించారు.అలాగే ప్రజల సమస్యలు సూచనలు తెలుసుకొని,వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రజల ఆశీస్సులు,సహకారంతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు, క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్‌చార్జులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల భీమా ,ఎల్ నినో పై రైతులకు అవగాహన కార్యక్రమం

.నీటి వినియోగం తక్కువ ఉండే పంటను సాగు చేయండి సొసైటీ అధ్యక్షుడు కొండబాబు






**తాళ్లపూడి, జూలై 28, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం తాడిపూడి సొసైటీ నందు మంగళవారం రైతులకు "ఎల్ నినో ప్రభావం- ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం,పంటల బీమా" పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రైతులు తాము సాగు చేసే వరి పంటకు ఎకరానికి 570, రూపాయలు మినుము పంటకు 300రూపాయలు ఎకరానికి,అరటి పంటకు ఎకరానికి 3000 రూపాయలు ప్రీమియం నగదును రుణం తీసుకునే రైతులు బ్యాంకులు/ సొసైటీ ల ద్వారా అలాగే రుణం తీసుకోని రైతులు సి ఎస్ సి సెంటర్ల ద్వారా లేదా పంటల బీమా పథకం పోర్టల్ ద్వారా ఎన్రోల్మెంట్ చేయించుకుని ఎల్ నినో ప్రభావం వల్ల నష్టం జరగకుండా తమ పంటలకు ఆర్థిక రక్షణ కల్పించుకోవలసినదిగా అవగాహన కల్పించటం జరిగింది.వరికి ప్రీమియం చెల్లించుటకు ఆఖరి తేదీ 15.08.2026 మరియు మినుము, అరటి పంటలకు ప్రీమియం చెల్లించుటకు చివరి తేదీ 31.07.2026 .కనుక రైతులు చివరి తేదీ లోపు ప్రీమియం చెల్లించవలసిందిగా తెలియజేయటం జరిగింది. అలాగే. తాడిపూడి సొసైటీ ప్రెసిడెంట్ నామా కొండబాబు మాట్లాడుతూ రైతులు వరికి ప్రత్యామ్నాయం గా నీటి వినియోగం తక్కువ ఉండే అపరాలు,చిరుధాన్యాల సాగు చేయవలసినదిగా తెలియజేయటం జరిగింది అలాగే రైతులంతా పంటల బీమా పథకం చెల్లించి తమ పంటలకు ఆర్థిక రక్షణ కల్పించుకోవలసినదిగా తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రుచిత , టిడిపి నాయకుల సిద్ధన రాధాకృష్ణ,రెవెన్యూ అధికారులు, వి హెచ్ ఎ గౌతమి , సొసైటీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు

## కవిటంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన తహసీల్దార్.



**పోడూరు / పాలకొల్లు. ప్రజాజ్యోతి. రిపోర్టర్ కొట్టి రామం. జూలై 28.** పోడూరు మండలం కవిటం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అనుసరించి మంగళవారం పులిహోర, టమాటా కొత్తిమీర పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డుతో భోజనాలు తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు తనిఖీలో తహసీల్దార్ గమనించారు. విద్యార్థుల హాజరును ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వడ్డీస్తున్న భోజన పదార్థాలు ఎలా ఉంటున్నాయని విద్యార్థులను అడుగగా రుచికరంగానే ఉన్నాయని వారు చెప్పటం పట్ల తహసీల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ వారికి తగు సూచనలు చేశారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**- వాహన దారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించిన ఎస్. ఐ రాజేష్**




**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** ప్రతీ ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని ఎస్. ఐ రాజేష్ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో స్థానిక రాపాక జంక్షన్ వద్ద అభయం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం సంభవించడం అంటే వాహనం రోడ్డు పై పడటం కాదు ఒక కుటుంబం మొత్తం రోడ్డున పడటమని అన్నారు.ప్రమాదం ఎప్పుడూ ఏ రూపంలో సంభవిస్తుంది అనేది ఎవరూ ఊహించలేరని ,అందుకే ప్రతీ ఒక్క వాహన దారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు అతివేగం , నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు , భీమా తదితర పత్రాలను ఎప్పటికప్పుడు తమతో పాటు ఉంచుకోవాలని తెలిపారు.

## అధికారులు కేంద్ర,రాష్ట్ర పెద్దలు పునరాలోచన చేయాలి!..

**కట్ ఆఫ్ డేట్ కు తొమ్మిదేళ్లు!..**

**అప్పుడు18ఏళ్ళు నిండని వారికి ఇప్పుడు25 ఏళ్ళు!..**



**ఆకుటుంబానికి దిక్కేవరు!.. వి.ఆర్.పురం,జులై28(ప్రజాజ్యోతి ప్రతినిధి)**2017,నోటిఫికేషన్, కట్ ఆఫ్ తేదీ నాటికి,18సంవత్సరాలు నిండని యువతీయువకులు ప్రస్తుతం 25 సంవత్సరాల వయస్సువచ్చిఉన్నారని, వారిలోచాలామంది వివాహం చేసుకొని భార్య పిల్లలతో కుటుంబంగా ఏర్పడ్డారని,ప్రభుత్వాధికారులు, స్పందించాలని,కట్ ఆఫ్ తేదీ పూర్తయితొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా,ఇంతవరకుపునరావాస కేంద్రాలకు తరలించలేదని, ప్రస్తుతం పునరావాస కేంద్రానికి తరలిస్తే ఆర్అఆర్ ప్యాకేజీ ఇవ్వక,ఇల్లులేక వాళ్ళుకుటుంబంతో ఎలా బ్రతకాలని జనసేనపార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, ఆవేదన వ్యక్తం చేశారు. 2017 సంవత్సరంలో అమలుచేసిన కట్ ఆఫ్ తేదీని 2022 కు మార్చి అర్హులైన వారందరికీ, ఆర్ ఆర్, ప్యాకేజీ, మరియు ”పునరావా సంకల్పించాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, జడ్పి. టి.సి, వాళ్ళ రంగారెడ్డి,ఆధ్వర్యంలో ఐ.టి.డి.ఎ,ప్రాజెక్టు అధికారి, శుభమ్ నొక్వాల్,(ఐ. ఏ.ఎస్)ను కోరామని వివరించారు. మంగళవారం వారు నిర్వాసిత, యువతతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్ పెడపెట్ల పవన్ కళ్యాణ్, పరాంకుశం మణికంత, నమ్మల్వార్,వివిధ గ్రామాల యువతపెద్దఎత్తున పాల్గొన్నారు.

## నిట్రవట్టి గ్రామంలో పెద్దమ్మ అవ్వ దేవర



**హాలహర్వి జూలై 28, ప్రజా జ్యోతి :-**మండల పరిధిలోని నిట్రవట్టి గ్రామంలో శ్రీ పెద్దమ్మవ్వ దేవర సందర్భంగా పచ్చారపల్లి రాఘవేంద్ర రెడ్డి, అమ్మ హాస్పిటల్ ఓనర్, శివశంకర్ రెడ్డి 11000, రూపాయలు అమ్మవారికి విరాళంగా పెద్దమ్మ దేవాలయం ట్రస్ట్ సభ్యులు మాజీ ఎంపిటిసి తిమ్మప్ప కు 11,000/రూ విరాళంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

**వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ‘రెండేళ్ల నమ్మకం’అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమం**



**ఆలూరు/హోళగుంద, జూలై 28, ప్రజా జ్యోతి న్యూస్ -** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆలూరు పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ లో “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం” కార్య క్రమాన్ని నిర్వహించారు.ఆలూరు నియోజ కవర్గ టిడిపి ఇన్‌చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి నేతృత్వంలో సాగిన ఈ డోర్-టు-డోర్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ప్రతి ఇంటికీ అభివృద్ధి బాటలు**

కార్యక్రమంలో భాగంగా శ్రీమతి వైకుంఠం జ్యోతి ప్రతి ఇంటికీ వెళ్తూ, గత రెండేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను కాలనీవాసులకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో నియోజకవర్గ అబ్జర్వర్ తలారి ఆదినారాయణ ప్రత్యేకంగా పాల్గొని, కూటమి ప్రభుత్వ ఆశయాలను, ప్రజలకు అందుతున్న ఫలాలను వివరించారు.

**ఘన స్వాగతం పలికిన ప్రజలు**

ఇంటింటికీ పర్యటిస్తున్న వేళ ఎన్జీవోస్ కాలనీ ప్రజలు, మహిళలు, శ్రీమతి వైకుంఠం జ్యోతి, పరిశీలకులు ఆదినారాయణ, కూటమి నాయకులకు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి వైకుంఠం జ్యోతి పడుతున్న శ్రమను, ప్రజలకు అందుబాటులో ఉండే తీరును కాలనీవాసులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమానికి ఎలాంటి డోకా రానివ్వం

**గిరిజనచట్టాలఅమలుకు తొలి ప్రాధాన్యం!..**

**గిరిజనంఅభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట!..**

**వేదికలో పాల్గొన్న గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి!..**

**హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత!..జిల్లా కలెక్టర్లు!..**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి!..**








**వి.ఆర్.పురం,రంపచోడవరం, జులై28(ప్రజాజ్యోతి ప్రతినిధి)** గిరిజన సంక్షేమాభివృద్ధిలో కూటమి ప్రభుత్వం, ఎప్పుడూ పెద్ద మనసుతోనే వ్యవహరిస్తుందని,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మంగళవారం, పాడేరు కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధ్యక్షతన గిరిజన చట్టాల పరిరక్షణ విషయమై అంతర్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం,మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి, వంగలపూడి అనిత,సౌజన్యంలో నిర్వహించి న సమావేశంలో ఆమె పాల్గొనిమాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అమలు చేస్తున్న విషయాలపై క్షుణ్ణంగా వివరించా రు.ఆదివాసీచట్టాల కు ఎలాంటి విఘాతం రాకుండా కూటమి ప్రభుత్వంచర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు కల్పనకోసం మొట్టమొదట కృషిచేసి వారిజీవితాల్లో వెలుగులు నింపిన పార్టీ తెలుగుదేశంపార్టీ అన్నారు. వక్తలుమాట్లాడుతూ ప్రస్తుతం జీవో నం 3 సర్వోన్నత న్యాయస్థానంలో రద్దుకుగల కారణాలపై వివరించారు.దాని పునరుద్ధరణకు న్యాయపరంగా కూడా ఎలాంటి చిక్కులు లేకుండా ముందుకు సాగేలా కసరత్తు, ప్రాముఖ్యమన్నారు. దీని పై పలు ఆదివాసీ, సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వారి యొక్క సూచనలు,సలహాలు తీసుకున్నారు.కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గిరిజన పక్షపాతి అనే విషయాన్ని ఆదివాసీ సమాజం గుర్తుంచుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లా కలెక్టర్లు సమక్షం లో ఈసమావేశం నిర్వహించారు.యావత్తు గిరిజనప్రాంత ప్రయోజనాలు సంరక్షించే విధానంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ కుమార్,పాడేరు నియోజకవర్గ ఇంచార్జీ గిడ్డి ఈశ్వరి,తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజోరు తేజోవతి,సివెరి అబ్రహం,కలెక్టర్ దినేష్ కుమార్, టి.నిశాంతి, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు మొట్ట డం రామారావు, రామారావు, పలువురు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆత్మీయ సమావేశం

**దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**: చిల్లపల్లి శ్రీనివాసరావు**





**మంగళగిరి:(ప్రజా జ్యోతి)**జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డులోని ఊర్వశి సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న చిల్లపల్లి కళ్యాణ మండపంలో దివ్యాంగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా తమకు నాయకత్వం వహించే బలమైన నాయకుడు అవసరమని, జనసేన పార్టీలో ప్రత్యేకంగా దివ్యాంగుల వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, దివ్యాంగు లకు ప్రత్యేక నాయకత్వాన్ని నియమించేలా విజ్ఞప్తి చేస్తామని చిల్లపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “ఇంద్రధనస్సు” పథకం దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికాక ముందే ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులకు స్కూటీల పంపి ణీ చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమా న్ని మరింత విస్తృతంగా కొనసాగించి అర్హులైన ప్రతి దివ్యాంగు డికి స్కూటీలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా జనసేన పార్టీ నిరంతరం కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఇటీవల జనసేన పార్టీ నూతన కమిటీల కోసం దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంలో అనేక మంది దివ్యాంగులు ముందుకు వచ్చి, పార్టీ కోసం తమ వంతు సేవ చేయాలని, తమకూ పార్టీ కమిటీల్లో అవకాశం కల్పించాలని కోరడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. పార్టీ కోసం కష్టపడే దివ్యాంగులను ప్రోత్సహించేలా పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసే దిశగా సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి రోశయ్య పార్టీ నాయకులు గంజి చిరంజీవి రాష్ట్ర నలుమూలల నుంచి దివ్యాంగులు తదితరులు పిఠాపురం నియోజవర్గం నుంచి కాకినాడ పార్లమెంట్ రి సాదక్ ప్రతినిధి మెడిశెట్టి నాగమణి ,కోళ్ల శ్రీనివాస్‌బ్రహ్మ దేవు రాంబాబు,మటమ్ జ్యోతి,షక్ మదన్ ,తుర్పాటి నాగేంద్ర కుమార్ మేడిశెట్టి అవిష్ పాల్గొన్నారు.

## చంద్రబాబు విజన్ ను ఎప్పటికీ మర్చిపోలేమంటున్న రాష్ట్ర ప్రజలు

**ఫేక్ ఉద్యమాలకు గొడ్డలి పార్టీ శ్రీకారం చుట్టింది**

**వైసీపీ నాయకులకు తప్పుడు ధర్నాలు ఫేక్ వీడియోలు తప్ప ఏనాడైనా మంచి ఆలోచనలు చేయలేదు**

**ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ప్రజల నుండి అనూహ్యస్పందన**

**గాజుల ఖాదర్ బాషా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు**



**రాయచోటి జూలై 28 ప్రజా జ్యోతి** ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ బాబు ఆదేశాలతో మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు మంత్రి తమ్ముడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సూచనలతో నిర్వహించిన ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషాఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలని వార్డులలో ప్రజలు దీవెనలు అందిస్తున్నారని ఇంత మంచి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించే ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అని వృద్ధులు వితంతువులు వికలాంగులు రైతులు యువత ప్రతి ఒక్కరి నోటినుండి వినిపిస్తున్న మాట అని చెప్పారు ప్రజలలో వస్తున్న జనాధరణను చూసి ఓర్వలేక వైసిపి పార్టీ అభివృద్ధి జరగకుండా అడ్డుకోవాలని చూస్తుందని చెప్పారు రాష్ట్రంలో ప్రశాంతత లేకుండా పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని చెప్పారు డీఎస్సీలో పారదర్శకంగా పోస్టులు భర్తీ చేస్తే ఫేక్ వైసీపీ బ్యాచ్ మంత్రివర్యులు నారా లోకేష్ పై ఆరోపణలు చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు దమ్ముంటే చర్చకు రండి అని గొడ్డలి పార్టీ బ్యాచ్ కు సవాల్ విసిరారు కష్టపడి చదివి నిరుద్యోగులు ఉద్యోగం సాధిస్తే వారిని కూడా నానా బూతు మాటలు వైసిపి నాయకులు మాట్లాడటం సమంజసం కాదని తెలిపారు అనంతరం టిడిపి రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు వార్డులోని ప్రజలు మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నీటి సౌకర్యం రోడ్డు సౌకర్యం కల్పించారని గత వైసిపి ప్రభుత్వంలో పట్టించుకోలేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యూనిట్ ఇంచార్జ్ మణికంఠ బుద్ధి ఇంచార్జ్ మల్లికార్జున అమీర్ భాష రాజు సూరి రోఫా హైదర్ మరి యు తదితరులు పాల్గొన్నారు.

# నేటి పరిస్థితులపై నాడే విస్తరించిన తరిమెల నాగిరెడ్డి





**సిపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి**

**అమరవీరుల నినాదాలతో పురవీధుల్లో ఎర్రజెండాలతో భారీ ర్యాలీ**

**గుంతకల్లు జూలై 28 (ప్రజా జ్యోతి):** స్వాతంత్ర్యానంత రం భారతదేశంలో కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డి, నేటి ప్రపంచీకరణ, ప్రైవేటీకర ణల నేపథ్యంలో జరుగుతు న్న ప్రజాస్వామ్యవాద దోపిడీపై ఐదు దశాబ్దాల క్రితమే హెచ్చరించారు అని ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ రజక్, సిటిజన్స్ ప్రోగ్రెషన్ ఫోరం (సిపిఎఫ్) జిల్లా కార్యదర్శి తారక్ అన్నారు. మంగళవారం తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభను ఘనంగా నిర్వహిం చడం జరిగినది. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుండి 60 అడుగుల రోడ్డు పొట్టి శ్రీరాములు సర్కిల్ భగత్ సింగ్ సర్కిల్ పాత గుంతకల్లు మీదుగా బీరప్ప కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీగా ఎర్రజెండాల ప్రదర్శనగా అరుణోదయ సంస్కృతిక కళాకారుల ఆటపాటలతో ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సభకు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి సురేష్ అధ్యక్షత వహించినారు. సభలో తరిమెల నాగిరెడ్డి చిత్రపటానికి ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ రజాక్ సిటిజన్స్ ప్రోగ్రెసివ్ ఫోరం( సి పి ఎఫ్) జిల్లా కార్యదర్శి తారకేష్ , ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకప్ప రాయలసీమ విద్యావంతుల వేదిక వెంకటేష్ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సాకే హరి తదితరులు పూల హారం వేసి ఘనంగా అమరవీరులకు నివాళు ల ర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగినది. కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పీడిత ప్రజల విముక్తి కోసం సమసమాజ స్థాపన కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన గొప్ప విప్లవకారుడు ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీ గా గెలిచి చట్టసభలలో ప్రజల వానిని గట్టిగా వినిపిం చినారు. పశ్చిమబెంగాలలో డార్జిలింగ్ జిల్లా నక్సల్ బరి గ్రామంలో 1967లో కామ్రేడ్ చారు మజుందార్ నాయక త్వంలో వ్యవసాయ సాయుధ తిరుగుబాటు సంఘటన దేశంలో ఎంతో మంది విద్యార్థి యువకుల కు మేధావులకు ఎంతో స్ఫూర్తినిచ్చి విప్లవ ఉద్యమంలోకి వారందరూ రావడానికి కారణం అయినది. ఆ విధంగా 1969లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇచ్చి విప్లవ పార్టీలోకి రావడం జరిగినది. ఆయన సొంత ఆస్తులను కూడా ప్రజలకు పార్టీ కోసం త్యాగం చేసినా రు ఆయన ఎమర్జెన్సీ కాలంలో రహస్యంగానే ఉంటూ 1976లో జులై 28వ తారీఖున మరణిం చడం జరిగినది. అదేవిధం గా కామ్రేడ్ చారు మజుందార్ కా" ఎస్ ఏ రవూఫ్ కా" నంబాల కేశవరావు రాయల్ సుభాష్ చంద్రబోస్ వేలాది మంది విప్లవకారులు దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాయుధ ఉద్యమం ద్వారా పీడిత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించి అమరులు కావడం జరిగినది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తన 12 సంవత్సరాల పరిపాలనలో కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారుకు బహుళ జాతి కంపెనీలకు లక్షల కోట్లు విలువైన జాతి సంపదను దోచి పెట్టడం జరుగుతున్నది . రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వలన వ్యవసాయ రంగం సంక్షోభం లో ఉండడంతో రైతుల ఆత్మహత్య చేసుకోవడం, కార్మికులు పోరాడి సాధించు కున్న హక్కులు, సౌకర్యా లను నిర్వీరం చేయడం, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించకపో వడంతో నిరుద్యోగులుగా కోట్లాదిమంది ఉండడం, దేశంలో హిందూ మత రాజకీయాలు చేస్తూ మత ఘర్షణలను సృష్టించడం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఆదాని అంబానీ కంపెనీలకు మేలు చేయడం జరుగుతున్నది , కేంద్ర ప్రభుత్వ సంస్థలను న్యాయశాఖ సిబిఐ ఐటి ఆర్.బి.ఐ ఎలక్షన్ కమిషన్ ఎన్ఐఏ తమకు అనుకూలంగా చేసుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులు మేధావుల మీద అక్రమ కేసులను బనాయిస్తూ తీవ్ర భయాందోళనకు గురి చేయడం జరుగుతున్నది. మోడీ తన నియంతృత్వ చర్యలతో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడం జరుగుతున్నది. దేశంలో నక్సలిజం లేని ప్రాంతంగా చేస్తామని దండకారణ్యం ప్రాంతంలో ఆదివాసులకు అండగా నిలిచిన మావోయిస్టులను లక్షలాదిమంది మిలిటరీని ఉపయోగించి బూటకపు ఎన్కౌంటర్లు అనిచివేత లొంగుబాట్లు ద్వారా పీడిత ప్రజల ఉద్యమాన్ని నిర్వీర్యం చేసినామని మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకోవడం జరుగుతున్నది . కానీ నక్సలబరీ ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి తీవ్రమైన నిర్బంధాలను అణిచివేతలను ఎదుర్కొం టూ వస్తున్నది. అయినప్ప టికీ నక్సలబరి పోరాట స్ఫూర్తితో నేటికీ సామ్రాజ్య వాదం కార్పొరేట్ దోపిడీ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ఒక బలమైన సవాలుగా నిలుస్తున్నది. ఈ స్ఫూర్తిని అణిచివేయ కుండా తమ లక్ష్యాలు సాధించలేమని దోపిడీ పాలకవర్గం గుర్తించినది. అందుకే విప్లవ ఉద్యమాన్ని నిర్మూలించాల నే ఉద్దేశంతో నే ఆపరేషన్ కగార్ వంటి నిర్బంధ చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టడం జరిగినది. పీడిత ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దోపిడీ లేని సమాజ నిర్మాణం లో ఉందని సోషలిస్ట్ వ్యవస్థ ద్వారానే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, కార్యకర్త లు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు పంపిణీ!..

ఎం.పి.పి. కారం లక్ష్మీ!..



**వి.ఆర్.పురం,జులై28(ప్రజాజ్యోతి ప్రతినిధి)**రైతులందరూ సకాలంలో వ్యవసాయ పనులు చేయాలని,ఎం.పి.పి కారం లక్ష్మీ, సూచించారు. మంగళవారం ,మండలం సొసైటి,కార్యాలయంలో మండల ఎం.పీ.పీ కారం లక్ష్మి, చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులందరూ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రైతులకు సరిపడా ఎరువులు యూరియాతో పాటుగా డి.ఏ.పి మరియు అవసరమైన ఎరువులుఅన్ని అందుబాటు లో ఉంచాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొంది. చంద్రయ్య,జడ్పీ.టి.సి వాళ్ళ రంగారెడ్డి,జనసేనపార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ,సి.పి.ఎం,పార్టీ మండల కార్యదర్శి,శ్రీరామగిరి గ్రామపంచాయతీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్,నాయకులు కారం సుందరయ్య,పోడియం శ్రీరామ్మూర్తి,గుండెపుడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్, పులి బోజ్జి,సీరపు తాతబాబు, గొర్రె వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు

## ఎక్కడ డ్రైనేజీలు అక్కడే జామ్..!

**20 రోజులుగా అండర్ డ్రైనేజీలు బ్లాక్ -- పట్టించుకోని అధికారులు**



**కంబదూరు జులై 28: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు: మండల కేంద్రంలోని వడ్డే కాలనీ సమీపంలో రెడ్డి జిన్నా ఎదురుగా ఉన్న అండర్ డ్రైనేజీలు దాదాపు 20 నుంచి 25 రోజులుగా బ్లాక్ అయి మురుగునీరు బయటకు పొంగిపొర్లు తున్నా సంబంధిత అధికారులు పట్టించుకో వడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల మరమ్మతుల కోసం తవ్విన గుంతలను అలాగే వదిలేయడంతో రహదారిపై మట్టి పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్‌గా ఉన్న డ్రైనేజీల నుంచి దుర్వాసన వ్యాపిస్తుండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో పారిశుధ్య సమస్య మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వేసిన మట్టిని తొలగించి, బ్లాక్ అయిన అండర్ డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని వడ్డే కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల బీసీ బాయ్స్ హాస్టల్ నందు మంగళవారం పర్యావరణ పరిరక్షణపై న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. పిఠాపురం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సదస్సులో ప్యానల్ న్యాయవాదులు కొంగు నూకరాజు, జనరల్ సెక్రెటరీ బి.ఎ.కె.బి. ఈశ్వర్ బాబు, ఎస్. నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్యావరణం మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని పరిరక్షించడం వల్ల సమాజానికి ఎంతో మేలు మరియు ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు.

**చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు:**

మానవాళికి అవసరమైన ప్రాణవాయువు తగినంతగా లభించాలంటే చెట్లను పెద్ద ఎత్తున పెంచాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. స్వార్థం కోసం చెట్లను నరికివేస్తే ఆక్సిజన్ కొరత ఏర్పడి, మనుషులు రకరకాల రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణానికి హాని కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, హాస్టల్ సిబ్బంది అంబేద్కర్, చంటిబాబు, ప్రతాప్ మరియు సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ/ఎస్టీల ఫిర్యాదుల పట్ల, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం

**మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆవేదన**



**పీలేరు జూలై 28 ప్రజా జ్యోతి** పీలేరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగిన ఎస్సీ /ఎస్టీలు చేసిన ఫిర్యాదులు మరియు వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని నేడు స్థానిక మాలమహానాడు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పీలేరు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అగ్రకుల పెత్తందారులకు, అధికార పార్టీ నాయకుల సమస్యలకు అగ్ర తాంబూలం ఇచ్చి వెను వెంటనే రెడ్ కార్పేట్ వేసి సమస్యలు క్షణాలలో అధికారులే దగ్గర ఉండి రాచ మర్యాదలతో వచ్చిన వారి చొక్కాలు నలగకుండా వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు కానీ ఎస్సీ /ఎస్టీల ఫిర్యాదుల పట్ల గాని మరియు వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పరిష్కార మార్గాలు కానరావడం లేదు రాజ్యాంగంలోని చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి ఎస్సీ/ఎస్టీ ల సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయో తెలియదు కానీ ఎస్సీ/ఎస్టీల సహనాన్ని అధికారులు అలుసుగా తీసుకుంటే మాత్రం అధికారులు ఎప్పుడో అప్పుడు బాధపడే సందర్భాలు వస్తాయి స్వాతంత్ర్యానికి మునుపు ఉన్న వివక్ష నేడు ఎస్సీ /ఎస్టీల ఫిర్యాదుల పట్ల సమస్యల పట్ల స్పష్టంగా ప్రస్ఫుటమవుతున్నాయి పీలేరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న అధికారులు ఇకనైనా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ /ఎస్టీలఫిర్యాదులపైన, సమస్యలపైన పరిష్కారానికి సమయం కేటాయించాలని అయన డిమాండ్ చేశారు

## డాక్యుమెంట్ రైటర్స్ దీక్షకు మద్దతు తెలిపిన సిపిఐ నాయకులు



**గుంతకల్లు జులై 28 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంతకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన దీక్షకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి సిపిఐ నాయకులతో కలిసి దీక్ష శిబిరం దగ్గరకు చేరుకొని తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా జగదీష్, వీరభద్ర స్వామి మాట్లాడు తూ జీవో 396 అమలుతో డాక్యుమెంట్ రైటర్స్ ఉపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందని, వేలాది మంది డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందని తక్షణమే జీవో నెంబర్ 396 రద్దుచేసి, డాక్యుమెంట్ రైటర్ తో చర్చలు జరిపి వారి న్యాయ మైన కోర్టులను తీర్చాలని సిపిఐ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య, ఏఐవైఎఫ్ నాయకులు నందు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్, సిపిఐ నాయ కులు ఉమర్ భాష, దౌల, హమాలి నాయకులు పెద్దయ్య, నబి పాల్గొని మద్దతు తెలిపారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు జులై 31.

హెచ్ఎం సనపల వైకుంఠరావు.



**ప్రజాజ్యోతిరిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం:వివిధ రకాల వ్యక్తిగత, ఆర్థిక, సామాజిక కారణాల వల్ల చదువుకు దూరమైన వారందరికీ విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని పాతపట్నం పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠరావు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనే ఉన్నతమైన ఆశయంతో రూపుదిద్దుకున్న ఈ పథకం ద్వారా పాఠశాలలు, కళాశాలలకు నేరుగా వెళ్లే వెసులుబాటు లేనివారు తమ వద్దనే ఉంటూ, సొంత పనులు లేదా ఉద్యోగాలు చేసుకుంటూనే ఉన్నత చదువులు కొనసాగించవచ్చని ఆయన పేర్కొన్నారు. నామమాత్రపు రుసుముతోనే నాణ్యమైన విద్యను అందించేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ అన్ని ఏర్పాట్లు చేసిందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని కోరారు.ఈ క్రమంలో 10వ తరగతి (ఎస్సెస్సీ) మరియు ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరాలనుకునే వారి కోసం ఎటువంటి అపరాధ రుసుము (లేట్ ఫీజు) లేకుండా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. మధ్యలోనే చదువు నిలిపివేసిన యువతీ యువకులు, వివిధ రంగాల్లో స్థిరపడిన నిరుద్యోగులు, గృహిణులు, చేతివృత్తుల వారు మరియు ఏ వయస్సు వారైనా సరే ఈ ఓపెన్ స్కూల్ వ్యవహారంలో చేరడానికి పూర్తి అర్హులని ఆయన స్పష్టం చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ ఇదొక సువర్ణావకాశమని అభివర్ణించారు.ఓపెన్ స్కూల్ విధానం ద్వారా కోర్సులు పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అందజేసే సర్టిఫికేట్లకు రాష్ట్రస్థాయి లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పూర్తిస్థాయి చెల్లుబాటు మరియు గుర్తింపు లభిస్తుందని హెచ్ఎం వైకుంఠరావు హామీ ఇచ్చారు. ఈ సర్టిఫికెట్లు రెగ్యులర్ విద్యార్థుల పత్రాలతో సమానంగా పరిగణించబడతాయని, ఇవి భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నియామకాలకు, అలాగే ఇతర ఉన్నత వృత్తి విద్యా కోర్సుల్లో ప్రొఫెషనల్ కోర్సులు ప్రవేశాలు పొందడానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. కాబట్టి అర్హత, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ వెంటనే స్పందించి ఈ నెల 31వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, విద్యా సంవత్సరాన్ని వృథా చేసుకోకుండా ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## మాజీ స్పీకర్ తమ్మినేని పై అసత్య ఆరోపణలు ఖండనీయం

**- మాజీ స్పీకర్ ను కలిసిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్ ) దుంపల రామారావు,టెక్కలి నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:**మాజీ స్పీకర్ , వైఎస్సార్సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం పై ఇటీవల భూ వివాదం పేరుతో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్), టెక్కలి నియోజకవర్గ సమ న్వయ కర్త పేరాడ తిలక్,గుమ్మడి రాంబాబు అన్నారు. మంగళవారం నాడు ఆమదాలవలస లో తమ్మినేనిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ కీయ కక్ష సాధింపుల కోసం తమ్మినేని సీతారాం ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో నిరాధా ర ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని స్పష్టం చేశారు.

## సరైన వైద్యం అందక జెర్సీఆవు మృతి.

**సుమారు 70,000 వేల రూపాయలు విలువైన ఆవు మృతి**



**కంబదూరు జూలై 28:(ప్రజా జ్యోతి) న్యూస్** కంబదూరు మండల పరిధిలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప అనే రైతుకు చెందిన జెర్సీ ఆవు పశు వైద్యుల నిర్లక్ష్యంతో మంగళవారం మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కిష్టప్పకు చెందిన ఓ జెర్సీ ఆవు సుమారు 70,000 వేల రూపాయల విలువైన ఆవు అనారోగ్యానికి గురికాగా సమయానికి సరైన వైద్య సేవలు అందక మృతి చెందిందని వారు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆవు అస్వస్థకు గురైన వెంటనే పశు వైద్య అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు సరైన వైద్యం అందించక ఆవు మృతి చెందిందని ఆరోపించారు. రోజువారి రైతు పనులు చేసుకుంటూ జీవనం సాగించే కిష్టప్ప కుటుంబానికి ప్రధాన ఆదాయం ఉండగా దాని మృతి ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది ఈ ఘటనపై గ్రామస్తులు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

# భూమి కొనుగోలు లో ఎలాంటి అక్రమ మార్గం లేదు

- నిబంధనలను అనుసరిస్తూ భూమి రిజిస్ట్రేషన్
- భూ రిజిస్ట్రేషన్ లో మేము కూడా బాధితులమే
- రిజిస్ట్రేషన్ అనంతరం యాజమాన్యానికి వివాదాలు ఉన్నాయని తెలిసి సివిల్ కోర్టును ఆశ్రయించాం
- భూ విషయం పై సివిల్ కోర్టులో కేసు నడుస్తుంది
- తాను ఎప్పుడూ చట్టాన్ని ఉల్లంఘించలేదు
- చట్ట విరుద్ధ పనులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు
- దర్యాప్తు పూర్తికాకుండా ఎటువంటి నిర్ణయాలకు రావొద్దు
- సమస్యను పూర్తిగా చట్టబద్ధంగా ఎదుర్కొంటా
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



**ఆమదాలవలస ప్రజాజ్యోతి న్యూస్:**భూ వ్యవహారానికి సంబంధించి ఇటీవల తనపై వచ్చిన ఆరోపణలు తప్పుడు ప్రచారాలపై మాజీ స్పీకర్ వైఎస్సార్సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం తన నివాసం వద్ద నుండి వీడియో ప్రసంగం ద్వారా స్పందించారు. భూమి కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అక్రమ మార్గం అనుసరించలేదని పూర్తిగా నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా జీవితంలో చట్టాన్ని గౌరవిస్తూ వచ్చామని అటువంటి నేను గాని ,నా కుటుంబ సభ్యులు గానీ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా చట్టాన్ని అగౌరవ పరిచే విధంగా వ్యవహరించబోమని స్పష్టం చేశారు. భూమి విక్రయ సమయంలో కొందరు చెప్పిన సమాచారంతో డాక్యుమెంట్ రైటర్లు మధ్యవర్తులు చూపించిన పత్రాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పత్రాల పరిశీలన పూర్తి జరిగిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందని ఆ సమయంలో ఎటువంటి అభ్యంతరాలు లోపాలు ఉన్నాయని తమకు తెలియదన్నారు. తర్వాత భూ యాజమాన్యానికి సంబంధించి వివాదాలు ఉన్నాయని తెలిసి సివిల్ కోర్టును ఆశ్రయించామని ,న్యాయబద్ధమైన మార్గంలో న్యాయం కోసం కోర్టును ఆశ్రయించగా ఏడాదిన్నరగా కేసు కొనసాగుతుందన్నారు. ఈ వివాదంలో తాము కూడా బాధితులమేనన్నారు. సివిల్ కోర్టులో విచారణ కొనసాగుతుండగా క్రిమినల్ కేసు నమోదు కావడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు న్యాయవాదులు ఈ అంశం పై చట్టపరంగా వాదనలు వినిపిస్తున్నారని ,న్యాయస్థానంలో వాస్తవాలు నిర్ధారణ అవుతాయనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. చట్టం ముందు హాజరై,అవసరమైన పత్రాలు సమర్పిస్తామని కేసు దర్యాప్తు లో పూర్తిగా సహకరిస్తామన్నారు. రాజకీయంలో ఎన్నో సవాళ్లు ,ఒడిదుడుకులు ,విమర్శలు ఎదుర్కొన్నానని కానీ వ్యక్తిగతంగా ఎవరికీ అన్యాయం చేయలేదని చట్టం పైన పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు.

# డీఎస్సీ అవకతవకలపై వైఎస్సార్‌సీపీ గరమ్..
# మంత్రి నారా లోకేష్ రాజీనామాకు డిమాండ్!

**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)**రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఇందుకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి వంగా గీత విశ్వనాథ్ పిలుపుతో కాకినాడ జిల్లాలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రతినిధులు, స్టేట్ యూత్ నాయకులు, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు.






**నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు: వైఎస్సార్‌సీపీ నేతలు**

ఈ సందర్భంగా నిరసనలో పాల్గొన్న ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు. ఎంతో కాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులను డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలు తీవ్ర నిరాశకు గురిచేశాయని ఆరోపించారు. పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోనూ పారదర్శకత లోపించిందని, అర్హులైన పేద, మధ్యతరగతి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు.

**పూర్తిస్థాయి విచారణ జరపాలి**

డీఎస్సీ ప్రక్రియలో జరిగిన ఈ భారీ స్కామ్‌పై తక్షణమే పూర్తిస్థాయి, నిష్పాక్షిక విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యాశాఖను సక్రమంగా నిర్వహించడంలో విఫలమవడమే కాకుండా, లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన మంత్రి నారా లోకేష్‌కు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని, వెంటనే ఆయన తప్పుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగాల కోసం రాత్రింబవళ్లు కష్టపడి చదివిన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ విశ్రమించదని ఈ సందర్భంగా నేతలు తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుంటే రాబోయే రోజుల్లో నిరుద్యోగులను, విద్యార్థులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు మరియు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఎటపాక గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం**

**ఎటపాక, జూలై 28 (ప్రజాజ్యోతి):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు ఎటపాక మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం పారదర్శక పాలనతో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచడంతో పాటు వికలాంగులకు రూ.6,000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 అందిస్తున్నట్లు వివరించారు. అలాగే గృహిణులకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల రాయితీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కుటుంబంలోని అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అన్న దాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం ద్వారా ఎలాంటి వివక్ష లేకుండా ఆర్థిక సహాయం అందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పాలడుగు నవీన్, తెలుగు యువత నాయకుడు పాటి సంపత్, ఐటీడీపీ అధ్యక్షుడు బాచినేని శ్రీకాంత్, బూత్ ఇన్‌చార్జీలు పోటు వెంకన్నబాబు, రాసాల చంటి, దాడి రామకృష్ణ, సగ్గుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు.

## అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా రెండేళ్ల కూటమి పాలన-ఎమ్మెల్యే సత్యప్రభ

**---ఏలేశ్వరం పట్టణంలో ఇంటింటి ప్రచారం**

**కాకినాడ జిల్లా జూలై 28 (ప్రజాజ్యోతి స్టాప్ రిపోర్టర్ )** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు,ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మున్సిపాలిటీ 18 వ వార్డు లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణ పార్టీ నాయకులు అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామిల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి హాజరయ్యారు.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.రెండేళ్ల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రజలకు వివరించారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా,రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు,రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలతో పంచుకున్నారు.పట్టణంలో అడుగడుగునా పూలమాలలతో హారతి నీరాజనాలతో తమ అభిమాన నేతకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్,టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు,మాజీ కౌన్సిలర్లు ఎండగుడి నాగబాబు, కోణాల వెంకట రమణ,పెంద్ర శ్రీను,రాయుడు చిన్న,గట్టెం వెంకట రమణ,రుచి రమేష్, వాగు రాజేష్,సామంతుల గోపి,గంగిరెడ్ల మణికంత, కోట్ల కృష్ణ, వైభోగల సుబ్బారావు, శంఖాని బాబ్జి,పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు..



## వీరభద్రపురం గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి.



**అనంతగిరి మండలం. జూలై 28. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామ రాజు జిల్లా. అనంతగిరి మండలం. పినకోట పంచాయితీ.వీరభద్రపురం గ్రామంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉంది గ్రామస్తులు గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నాయి. పలుమార్లు గ్రామస్తులు త్రాగునీటి సమస్య పై అధికారులకు ఫిర్యాదు చేసిన చేసిన ఫలితం లేదని గ్రామస్తులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి త్రాగునీరు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. లేనియెడల గ్రామ మహిళలతో ఖాళీ బిందెలతో సచివాలయం ద్వారా వద్ద ఆందోళన చేపడతామని ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఐదేళ్ల కిందట జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పైప్ లైన్ పనులను మధ్యలో నిలిపివేశారని గ్రామస్తులు, మహిళలు వాపోయారు. అధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే శుక్రవారం జరిగే పి. జి. ఆర్.( స్పందన కార్యక్రమంలో) కలెక్టర్కి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు, మహిళలు తెలియజేశారు.

## గుంతకల్లులో నమోదైన కరోనా కేసు



**గుంతకల్లు జూలై 28 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని బెంచ్ కొట్టాల కాలనీకి చెందిన కృష్ణవేణి (64) అను ఆమెకు నాలుగు రోజుల నుంచి తీవ్ర జ్వరం వస్తుండడంతో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఆమెకు రాపిడ్ టెస్టు,పీపీ టెస్టులు చేసిన తర్వాత కరోనా లక్షణాలు ఉన్నాయని అలాగే ఆమె కుమారుడికి స్వల్ప లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్వో హుటాహుటిన గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని లక్షణాలు ఉన్న వారిని ప్రత్యేక వార్డులో పెట్టడం జరిగింది. అనంతరం డిఎంహెచ్వో మాట్లాడుతూ ప్రజలు, జలుబు, దగ్గు, జ్వరము ఎక్కువ తీవ్రంగా ఉంటే డాక్టర్ని సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

## హోళగుంద ను కరువు మండలంగా ప్రకటించాలి

**రైతులు, ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలి**
**వైఎస్సార్సీపీ నేతల డిమాండ్**



**హోళగుంద, జూలై 28, ప్రజా జ్యోతి న్యూస్ -** హోళగుంద మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులు, సామాన్య ప్రజలను ఆదుకోవాలని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ షఫీఉల్లా డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై ఉన్న వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు, మండలంలోని ప్రతి గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి స్థానికులకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజల తరఫున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు వెంకటేష్, పులి మద్రిస్వామి, వందవగిలి శేషప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొని రైతులు, కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## నది కైరవాడిలో జోరుగా ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం- మండల నాయకులు ఖాసిం వలి



**ఎమ్మిగనూరు, జులై 28(ప్రజా జ్యోతి ):** ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం కొనసాగింపు నందవరం మండలంలోని నది కైరవడి గ్రామంలో 45 రోజుల "ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి, క్లస్టర్-1 ఇన్‌చార్జి వీరేశ్ తదితరులు పాల్గొని గ్రామ ప్రజలను కలిసి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే ప్రతి ఇంటికి తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ వీరారెడ్డి, డీలర్ బజారి, ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సిత్తరాల నవ్వు.. సిలకల్లే నువ్వు..

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. జి.జి.విహారి దర్శకుడు. రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రవి పనస ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి రెండో పాట 'సిత్తరాల నవ్వు' విడుదలైంది. కృష్ణప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు జి.జి.విహారి సాహిత్యాన్ని అందించారు. జావెద్ అలీ ఆలపించారు. 'సిత్తరాల నవ్వు..అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు..' అంటూ కథానాయిక అందాన్ని వర్ణిస్తూ ఈ పాట సాగింది. పల్లెటూరి నేపథ్యంలో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: కె.పి, కథ, దర్శకత్వం: జి.జి.విహారి.

# చిట్టి చేతులతో అయ్యో రామా..



దుల్కర్ సల్మాన్ మలయాళంలో పెద్ద స్టార్. అలాగే తెలుగు ప్రేక్షకులకూ అభిమాన నటుడు. దుల్కర్ తెలుగులో నేరుగా చేసిన మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ చిత్రాలు వసూళ్ల పరంగా వందకోట్ల మార్కును దాటాయి. ఇప్పుడున్న ఏ పరభాషా నటుడికీ దక్కని రికార్డ్ ఇది. ప్రస్తుతం ఆయన తెలుగులో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా చేస్తున్నారు. శ్రుతిహాసన్, సాత్విక వీరవల్లి కథానాయికలు. పవన్ సాదినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. మంగళవారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'చిట్టి చిట్టి చీమ.. చిట్టి చేతుల్తో అయ్యో రామా.. వంద టన్నుల చెక్కెర మోస్తుందమ్మా..' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. రమ్య బెహరా ఆలపించారు. కథలోని సారాంశాన్ని ఈ పాట సాహిత్యంలో మిళితం చేసి రాసినట్టుగా హీరోయిన్ కోణంలో ఈపాట సాగింది. నక్షత్రాలను తాకాలని కలలు కనే ఓ అమ్మాయి కలను, ఆమె పక్కనే నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే అబ్బాయి ప్రేమను ఈ పాట ప్రతిబింబిస్తున్నది. సంప్రదాయ ప్రేమకథలకు భిన్నంగా, ఒక ప్రత్యేకమైన బంధాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

# ఆరు నెలలు నాతో మాట్లాడలేదు

'లెనిన్'తో ఎట్టకేలకు హిట్ ట్రాక్ ఎక్కేసింది పూణే పూబోణి భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం 'లెనిన్' సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తూ, మరోవైపు తమిళంలో శివకార్తికేయన్ సరసన 'సియోన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. తాజాగా ఓ కళాశాల విద్యార్థులతో టాక్ షోలో ముచ్చటించిన భాగ్యశ్రీ.. తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నది. 'నాకు నటనంటే ఇష్టం. నటిని కావడం నా గోల్. కెరీర్ విషయంలో మన నిర్ణయాన్ని మన మనస్సాక్షి అంగీకరించినప్పుడు, ఇక ఏ విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ రాజీ పడాల్సివస్తే, మనకు మనమే పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. అందుకే నా నిర్ణయాన్ని నేరుగా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. 'వద్దు' అనింది. నాన్నకు ఫోన్ చేస్తే 'అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావ్?' అని ప్రశ్నించారు. అక్క అయినా మద్దతుగా నిలుస్తుందనుకుంటే.. 'అమ్మ నాన్న వద్దంటున్నారు కదా?' అనేసింది. ఇలా అంతా 'నో' చెప్పేశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆడిషన్స్‌కి వెళ్లిపోయా. దీంతో ఇంట్లో వాతావరణం వేడెక్కింది. మా అమ్మ ఆరు నెలలు నాతో మాట్లాడ్లేదు. నన్ను వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసింది. ఇప్పుడు ఈ విషయాన్ని నవ్వుతూ చెబుతున్నాను కానీ.. అప్పుడు మాత్రం చాలా బాధపడ్డా' అంటూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే.






# సిరీస్ చూసి చిరంజీవి మెచ్చుకున్నారు

శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సిరీస్ 'అబ్జెక్షన్ మై లార్డ్'. 'నోటరీ పరశురాం' అనేది ఉపశీర్షిక. అనన్యశర్మ, ముఖేష్‌రుషి, స్నేహల్, సమీర్ కీలక పాత్రధారులు. సంతోష్ అయ్యప్పన్ దర్శకుడు. రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మాత. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 31 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ కానున్నది. తాజాగా హైదరాబాద్‌లో ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌ని నిర్వహించారు. 'దర్శకుడు క్లారిటీతో ఈ సిరీస్ తెరకెక్కించారు. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. టోటల్ అవుట్‌పుట్ చూశాక ఫిదా అయ్యాం. ప్రతి పాత్రలోనూ మంచి ఎలివేషన్ ఉంటుంది. చిరంజీవి ఈ సిరీస్ చూసి బావుందని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మా టీమ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ 'కేవలం 19రోజుల్లో ఈ సిరీస్ షూటింగ్ పూర్తి చేశాం. టీమ్ అంతా సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. ఈ సిరీస్ సూపర్ సక్సెస్ అవుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల, నటులు ముఖేష్ రిషి, అనన్యశర్మ, సమీర్, నారాయణ హరిచంద్ర, జెమినీ సురేశ్ కూడా మాట్లాడారు.

# బిజినెస్

## జీడీపీ బాగా తగ్గొచ్చు: రాయిటర్స్ సర్వే

### మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులే




**బెంగళూరు :** దేశ ఆర్థిక వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గణనీయంగా పడిపోవచ్చని రాయిటర్స్ పోల్‌లో తేలింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) భారత జీడీపీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. ఈసారి మాత్రం మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలను మెజారిటీ ఎకనామిస్టులు వ్యక్తం చేయడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) కూడా వృద్ధిరేటు ఆశించిన స్థాయిలో ఉండదని చెప్తుండటం.. ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఓవైపు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లు క్షీణిస్తున్నాయని, మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయని ఎక్స్‌పర్ట్స్ గుర్తుచేస్తున్నారు. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరిగే క్రూడాయిల్ రేట్లు.. ఎకానమీ వృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని చెప్తున్నారు. అదుపు తప్పుతున్న ద్రవ్యోల్బణం, మార్కెట్‌లో పడిపోతున్న డిమాండ్, దిగజారుతున్న వినియోగదారుల కొనుగోలు శక్తి.. అన్నీ ప్రతికూల సంకేతాలుగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.6 శాతంగానే ఉండొచ్చని రాయిటర్స్ పోల్‌లో అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా 6.8 శాతంగానే ఉండొచ్చని అంటున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం 7.7 శాతంగా ఉన్నది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు




**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు ఒక్కరోజులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం భారీగా పెరిగిన ధరలు ఆ మరుసటి రోజూ అంతేస్థాయిలో కిందికి పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, రూపాయి పుంజుకోవడం ధరలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,640 తగ్గి రూ.1.47 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు రూ.1, 49,640గా ఉన్నదని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా దిగొచ్చాయి. కిలో వెండి ఏకంగా రూ.5,200 తగ్గి రూ.2,24, 800గా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పెరగడంతో మదుపర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఔన్స్ గోల్డ్ ధర 53.40 డాలర్లు లేదా 1.31 శాతం తగ్గి 4,023.50 డాలర్లకు పరిమితమవగా, వెండి 2 శాతం దిగి 57.24 డాలర్లుగా

# జరిమానాలు రూ.7,087 కోట్లు

### కనీస నగదు నిల్వల్లేని ఖాతాదారుల నుంచి ఏడాదిలో వసూలు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు




**న్యూఢిల్లీ :** గత ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు.. కరెంట్/సేవింగ్స్ ఖాతాల్లో కనీస నగదు నిల్వల మొత్తాలను నిర్వహించని కస్టమర్ల నుంచి దాదాపు రూ.7,087 కోట్లు వసూలు చేశాయి. ఇందులో ప్రైవేట్ బ్యాంకులు రూ.4,948.71 కోట్లు, సర్కారీ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు కలెక్ట్ చేసినట్టు ఓ ప్రశ్నకుగాను మంగళవారం రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ (రూ.1,081.33 కోట్లు) ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా (ఆర్బీఐ) వివరాలను మంత్రి పేర్కొన్నారు. అలాగే మొత్తం 19 ప్రైవేట్ రంగ బ్యాంకులు చేసిన వసూళ్లలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్‌ల వాటానే 58 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ఖాతాలు సహా ఇతర బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లపై ఈ చార్జీలేవీ పడలేదని స్పష్టం చేశారు. కాగా, గడిచిన 4 ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు ఇలా ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేకపోతే ఖాతాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలు రూ.26, 170.37 కోట్లుగా ఉండటం గమనార్హం.

### రూ.75,000 కోట్ల మోసం

కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్టీ) అధికారులు.. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.75,000 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మోసాన్ని గుర్తించారు. అత్యధికంగా గుజరాత్, మహారాష్ట్రల్లోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఈ మేరకు సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు లిఖితపూర్వకంగా సమాచారమిచ్చారు. ఐరన్ అండ్ స్టీల్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్స్, పేపర్ ప్రొడక్ట్స్,ప్లైవుడ్, సిమెంట్, కాపర్ వంటి గూడ్స్‌తోపాటు కాంట్రాక్ట్ సర్వీస్, మ్యాన్‌పవర్ సైప్లె సర్వీసెస్, రియల్ ఎస్టేట్ సర్వీసెస్ వంటి సేవల్లోనూ పన్ను ఎగవేతల్ని గుర్తించామని చెప్పుకొచ్చారు. మొత్తం 30,162 కేసులు నమోదయ్యాయని, వీటి విలువ రూ.74,782 కోట్లుగా ఉందని మంత్రి వివరించారు. గుజరాత్‌లో 12,511 కేసులు (రూ.12,633 కోట్లు), మహారాష్ట్రలో 9,629 కేసులు (18,320 కోట్లు) నమోదయ్యాయి. ఇక మొత్తంగా 2025-26లో 358 మంది అరెస్టయ్యారు.

### క్షీణించిన ఎఫ్‌డీఐలు

గత కొన్నేండ్లుగా దేశంలోకి నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుతున్నాయని పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా వెల్లడించారు. 2022-23లో 27.99 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2025-26లో 6.95 బిలియన్ డాలర్లకే పరిమితమైనట్టు రాజ్యసభలో మంత్రి ప్రకటించారు. కాగా, విదేశీ మదుపర్లు తమతమ దేశాలకు పంపుతున్న నిధులు పెరుగడం, అలాగే భారత్ నుంచి పెట్టుబడులను వెనుకకు తీసుకుంటుండటమే కారణమని చెప్పారు. 2023-24లో 10.13 బిలియన్ డాలర్లుగా ఉన్న నికర ఎఫ్‌డీఐ.. 2024-25లో 960 మిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలను ఊటంకిస్తూ వివరించారు. నిజానికి గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి రికార్డు స్థాయిలో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అయితే మళ్లీ 88 బిలియన్ డాలర్లదాకా తరలిపోయాయి.

## హెచ్‌యూఎల్ మరోసారి ధరల పోటు!




**న్యూఢిల్లీ :** హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) మరోసారి తన ఉత్పత్తుల ధరలను పెంచడానికి సిద్ధమవుతున్నది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన ద్రవ్యోల్బణంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికం నాటికి ధరల సూచీ 2-5 శాతం వరకు పెరిగే అవకాశం ఉండటంతో ధరల పెంపు అనివార్యమనిపిస్తున్నదని హెచ్‌యూఎల్ సీఈవో, ఎండీ ప్రియా నాయర్ తెలిపారు. ఇప్పటికే 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఉత్పత్తుల ధరలను 2-5 శాతం వరకు సవరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమన్నాయని, దీంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే కసరత్తును ప్రారంభించినట్టు చెప్పారు. వీటికితోడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఎల్ నినో ప్రభావంతో అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆమె హెచ్చరించారు.

## క్రిప్టో ఇన్వెస్టర్లకు ఊరట.. ఇక ఐటీఆర్ దాఖలు సులభం

### 'ట్యాక్స్‌లిస్ట్' టూల్‌ను తెచ్చిన వజీర్‌ఎక్స్



**న్యూఢిల్లీ :** గత కొన్నేండ్లుగా క్రిప్టో కరెన్సీల్లో మదుపు చేసేవారు క్రమేణా పెరుగుతున్నారు. అయితే ఏటా ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌ దాఖలు చేయాలంటే మాత్రం వీరికి తిప్పలు తప్పడం లేదు. ఈ క్రమంలోనే భారతీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్.. ఓ ఉచిత పన్ను నివేదిక సాధనాన్ని తీసుకొచ్చింది. ఐటీఆర్ దాఖలుకు గడువు తేదీ దగ్గరపడుతున్న క్రమంలో క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు ఊరటనిస్తూ 'ట్యాక్స్‌లిస్ట్' పేరిట ఫ్రీ క్రిప్టో ట్యాక్స్ రిపోర్టింగ్ వేదికను మంగళవారం పరిచయం చేసింది. దీంతో ఇక రకరకాల క్రిప్టో ఎక్స్ఛేంజీలలో జరిపిన లావాదేవీలకు సంబంధించి సులువుగానే ఇన్వెస్టర్లు తమ పన్ను నివేదికలను ఈ టూల్ ద్వారా అందుకోవచ్చని వజీర్‌ఎక్స్ చెప్తున్నది. ఏ ఎక్స్ఛేంజ్ నుంచైనాసరే మదుపర్లు తమ లావాదేవీల చరిత్రలను ట్యాక్స్‌లిస్ట్ ప్లాట్‌ఫామ్‌పై అప్‌లోడ్ చేసి లాభాలు, నష్టాలు, చెల్లించాల్సిన పన్ను వివరాల నివేదికలను నిమిషాల్లో పొందవచ్చని ఈ సందర్భంగా వజీర్‌ఎక్స్ తెలిపింది. క్రిప్టో ట్యాక్స్ లెక్కింపును సులభతరం చేసేలా ఈ సాధనాన్ని డిజైన్ చేశామని, ట్యాక్స్‌లిస్ట్ దానంతటదే వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సహా అన్నింటి లాభనష్టాలను అంచనా వేసి కచ్చితమైన రిపోర్టును ఇస్తుందన్నది.


# భళా షర్మిల.. అదరహో అజయ్..

### పారా షాట్‌పుట్‌లో పసిడితో ధన్‌ఖడ్ కొత్త చరిత్ర

### ఏపీ లిఫ్టర్ అజయ్, హర్జిందర్, హై జంపర్ సర్వేశ్‌కు రజతాలు

### శిల్పకు కాంస్యం.. తండ్రిని మించిన కొడుకు



గ్లాస్గో : పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. మహిళల పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌తో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్డ్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను (కౌంట్ బ్యాక్) లెక్కించారు. ఒకేసారి విఫలమైన బెక్‌ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు.

### ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్

ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్‌ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్‌లో గోల్డ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147o184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు. కాగా, మహిళల 63 కిలోల విభాగంలో నిరుపమ నిరాశపరిచింది.

### విధిరాతను ఎదిరించి.. స్వర్ణ చరిత్రను లిఖించి

ఒకవైపు వైకల్యం.. మరోవైపు నరకం చూపించే గృహ హింస.. ఇంకోవైపు ఇద్దరు చిన్నారులతో వీధిపాలైన దయనీయ స్థితి. ఇక ఈ జీవితం ముగిసిపోయింది.. ఆత్మహత్యే శరణ్యం అని అనుకున్న అత్యంత చీకటి క్షణంలో ఆమె ఒక ఓ నిర్ణయం తీసుకుంది. 'నా జీవితానికి మరో అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?' అని తన్నుకొచ్చిన ఆ ఆలోచనే ఆమె భవితవ్యాన్నే మార్చేసింది. చావు అంచున నిలబడి బతుక్కి రెండో చాన్స్ ఇచ్చిన ఆ నిర్ణయమే హర్యానాకు చెందిన 42 ఏండ్ల షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్‌లో పసిడి పతకం నెగ్గేలా చేసింది. హర్యానాలోని మహేందర్‌గఢ్ జిల్లా చిత్రౌలి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించింది షర్మిల.

తల్లి చూపులేనిది కావడంతో బాల్యం నుంచే కష్టాలు చవిచూసింది. రెండేండ్ల వయసులోనే తీవ్రమైన జ్వరం రాగా, సరైన వైద్యం అందక ఎడమ కాలు పోలియో బారిన పడింది. పదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన ఆమెకు 19 ఏండ్లకే పెళ్లి చే03శారు. అదనపు కట్నం తెమ్మంటూ భర్త తీవ్రంగా వేధించేవాడు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిందనే కోపంతో ఓ రోజు రాత్రి 11 నుంచి 3 గంటల దాకా చితకబాది, ఇద్దరు పసిపాపలతో సహా రోడ్డుపైకి తోసేశాడు. కనీసం బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దయనీయ స్థితిలో షర్మిల ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకుంది.

వారి పోషణ కోసం ఇండ్లలో పనులతో పాటు సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేసింది. ఇన్ని కష్టాల నడుమ వ్యాపారవేత్త అజిత్ సింగ్ రూపంలో ఆమెకు ఓ చేయుత లభించింది. అజిత్‌తో రెండో వివాహం జరిగాక ఆమె జీవితం మలుపు తిరిగింది. షర్మిల మానసిక దృఢత్వాన్ని, పట్టుదలను గుర్తించిన అజిత్ 2020లో (34 ఏండ్ల వయసులో) ఆమెను పారా అథ్లెటిక్స్ వైపు ప్రోత్సహించాడు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ ప్రకటించే వయసులో షర్మిల తొలిసారి చేతిలోకి షాట్‌పుట్ గుండును పట్టింది. కోచ్‌లు టెక్ చంద్, దేవేంద్ర పర్యవేక్షణలో కఠిన సాధన చేసింది. ఆమె శిక్షణ, డైట్ ఖర్చుల కోసం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తట్టుకుంటూ 2023లో తమ సొంతింటిని కూడా అమ్మేసి అద్దె ఇంట్లోకి మారింది. 2022 కామన్వెల్త్ గేమ్స్, 2023 ఆసియా పారా గేమ్స్‌లో నాలుగో స్థానంతో తృటిలో పతకాలు చేజారినా షర్మిల వెనకడుగు వేయలేదు. పట్టువదలకుండా శ్రమించి, గ్లాస్గో వేదికగా తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కష్టాలు వచ్చినా జీవితం అక్కడితో ముగిసిపోదని షర్మిల ఈ విజయంతో నిరూపించింది. విధిరాతను ఎదిరిస్తూ.. జీవితానికి రెండో అవకాశం ఇస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ప్రపంచానికి చాటిచెప్పింది.

### తండ్రిని మించిన కొడుకు

భారత్ ఆతిథ్యం ఇచ్చిన 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో ఏపీ లిఫ్టర్ శ్రీనివాసరావు 56 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలవగా.. 16 ఏండ్ల తర్వాత అతని కొడుకు అజయ్ బాబు మరో అడుగు ముందుకు వేసి రజత పతకంతో తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్‌కు ఆరేండ్ల వయసు ఉన్నప్పుడు శ్రీనివాసరావు కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం గెలిచాడు. ఆ రోజు ఊరంతా తమ ఇంట్లో టీవీకి అతుక్కుపోయి సంబరాలు చేసుకోవడం, ఆ పతకం తమ కుటుంబ ఆర్థిక కష్టాలను తీర్చడం అజయ్ చిన్నతనంలోనే చూశాడు. తండ్రి బాటలోనే క్రీడాకారుడిగా ప్రయాణం ప్రారంభించాడు. శ్రీనివాసరావు స్వయంగా కొడుకుకు శిక్షణ ఇచ్చి వెయిట్‌లిఫ్టింగ్ మెళకువలు నేర్పించాడు. ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురై జాతీయ టోర్నీల్లో విఫలమైనా.. 2024లో మోచేతి గాయంతో ఆటకు దూరమైనా తండ్రి అందించిన మనోధైర్యంతో అజయ్ మళ్లీ పుంజుకున్నాడు. గతేడాది కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో 335 కేజీలు ఎత్తి స్వర్ణం సాధించి సత్తా చాటాడు. ఇప్పుడు కామన్వెల్త్ గేమ్స్ రజతంతో మరో మెట్టుఎక్కాడు.

# స్పోర్ట్స్

## 5 ఓవర్లు మెయిడిన్లు వికెట్లు

### విండీస్ బౌలర్ గ్రీవ్స్ రికార్డు ప్రదర్శనకు పాక్ కుదేలు



**ట్రినిడాడ్ :** స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ పేసర్ జస్టిన్ గ్రీవ్స్ (5/27)రికార్డు ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను గజగజ వణికించాడు. వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 5 వికెట్లు పడగొట్టి పాక్ వెన్నువిరిచాడు. గ్రీవ్స్ పేస్ మ్యాజిక్‌తో తొలి ఇన్నింగ్స్ ఒక దశలో 62.5 ఓవర్లకు 244/3తో ఉన్న పాక్.. ఏడు ఓవర్ల వ్యవధిలోనే ఆరు వికెట్లు కోల్పోయి 267/9తో నిలిచింది. 64వ ఓవర్లో బంతినందుకున్న గ్రీవ్స్.. మొదట షాన్ మసూద్ (109)ను ఔట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో అలి ఉస్మాన్, జమాల్, రిజ్వాన్, అబ్బాస్‌ను ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

## సోనమ్ జోడీకి కాంస్యం



**హాంగ్జౌ :** ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ సోనమ్-హిమాన్షు కాంస్యం గెలిచింది. ఫైనల్‌లో భారత జంట 441.2 పాయింట్లు సాధించగా చైనాకు స్వర్ణం, రజతం దక్కాయి. ఈ టోర్నీలో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు రెండు కాంస్యాలతో నాలుగు పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది.

# మెగా డీఎస్సీ కాదు నిరుద్యోగులకు ‘దగా డీఎస్సీ

**వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి**

**మదనపల్లెలో వైఎస్ఆర్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**

**కదంతొక్కిన విద్యార్థులు, యువత డీఆర్వోకు వినతిపత్రం అందచేసిన వైఎస్ఆర్ సిపి నేతలు**

**చలో మదనపల్లె నిరసన కార్యక్రమానికి రాయచోటి నియోజక వర్గం నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు,కార్యకర్తలు**

**మదనపల్లి జూలై 28 ప్రజా జ్యోతి** మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి, మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ దేశాయ్ తిప్పారెడ్డి, పార్టీ నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మెగా డీఎస్సీఅంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం చివరకు దగా డీఎస్సీ”గా మార్చి నిరుద్యోగుల ఆశలను అడియాశలు చేసిందని విమర్శించారు.







డీఎస్సీ నియామక ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధారాలతో సహా అనేక ప్రశ్నలు లేవనెత్తినా ప్రభుత్వం సమాధానం చెప్పకుండా మౌనం పాటిస్తోందని ఆరోపించారు. డీఎస్సీ వ్యవహారానికి పూర్తి బాధ్యత విద్యాశాఖ మంత్రిదేనని, నైతిక బాధ్యత వహిస్తూ నారా లోకేశ్ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే పూర్తిగా విడుదల చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులు, యువత, నిరుద్యోగుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్ఆర్‌సీపీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# డీఎస్సీ అవకతవకలపై సీబీఐ దర్యాప్తు జరపాలి

**-కొల్లు త్రినాథ వర్మ డిమాండ్**
**--విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి**
**--డీఎస్సీ ప్రశ్నపత్రాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి**
**--డిజిటల్ అసిస్టెంట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు అన్యాయంపై నిలదీత**
**--సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు**
**--స్పోర్ట్స్ కోటా నిబంధనల మార్పులపై అభ్యంతరాలు**
**--ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అన్యాయం జరిగిందని ఆరోపణ**
**--ఉద్యోగాల పేరుతో డబ్బుల వసూళ్ల ఆరోపణలపై దర్యాప్తు కోరిన వర్మ**
**--లక్షలాది నిరుద్యోగుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శ**
**--డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం కోసం న్యాయపోరాటం చేస్తాం**



**అంబేద్కర్ కోనసీమ జిల్లా జూలై 28( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ )** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆర్టీఐ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాథ వర్మ డిమాండ్ చేశారు. డీఎస్సీ స్కామ్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్రపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణకు సహకరించాలని ఆయన కోరారు. స్పోర్ట్స్ కోటా విషయంలో డీఎస్సీ అభ్యర్థులు చేస్తున్న ఆరోపణలను ప్రభుత్వం నివృత్తి చేసి పారదర్శకతను నిరూపించుకోవాలని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితాలను ప్రతి కలెక్టరేట్‌లోనూ ప్రదర్శించే సంప్రదాయం ఉందని తెలిపారు. అయితే ప్రస్తుతం మెరిట్ లిస్టును విడుదల చేసి అనంతరం తొలగించడం,మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు కాకుండా ఇతరులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలోని ప్రశ్నపత్రాల్లోని వేలాది బిట్లు కొన్ని కోచింగ్ సెంటర్లకు ముందుగానే చేరినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని,కంప్యూటర్ డిజిటల్ అసిస్టెంట్ పోస్టుకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన అభ్యర్థిని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవకపోవడం మరింత అనుమానాలకు దారి తీస్తోందన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించిన మెసేజ్ ఆప్షన్ తొలగించడం, అభ్యర్థిని వెరిఫికేషన్‌కు పిలవకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ సర్టిఫికెట్ వెరిఫికే షన్‌కు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నిస్తే అధికారులు ఇచ్చిన సమాధానాలు కూడా అనుమానాల కు కారణమవుతున్నాయని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి అర్హత లేని వారికి అవకాశాలు కల్పించారని ఆరోపించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అభ్యర్థులకు అన్యాయం చేసి,కేవలం యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొన్న వారికి అవకాశాలు కల్పించడం వల్ల ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. కొన్ని పోస్టులకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలపై కూడా విచారణ జరపాలని కోరారు. రెండేళ్లుగా జాబ్ క్యాలెండర్ లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగం సాధించి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఆశతో ఇళ్లు, స్థలాలు తాకట్టు పెట్టి అప్పులు చేసి కోచింగ్ తీసుకున్న అభ్యర్థులను పక్కనపెట్టి అక్రమ మార్గాల్లో ఇతరులకు ఉద్యోగాలు కట్టబెట్టడం బాధాకరమన్నారు. డీఎస్సీ అభ్యర్థులు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారని వారికి న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ అంశంపై న్యాయవ్యవస్థ సుమోటోగా స్వీకరించి విచారణ జరిపి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కొల్లు త్రినాథ వర్మ కోరారు. రాష్ట్రంలో సుమారు 3.50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి తన శాఖలో జరిగిన వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లే,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి వారి భవిష్యత్తును కాపాడాలని వైఎస్సార్‌సీపీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## డివిజనల్ బెంచ్ కు సర్కార్..

**హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రంగనాథ్ స్పందించారు. తాము రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే హైడ్రా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటివరకు సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, వేల ఎకరాల భూములను వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, ఇటీవల లోతుకుంటలో భూకబ్జా యత్నాన్ని కూడా అడ్డుకుందని తెలిపారు. ఆక్రమణల తొలగింపుతో పాటు ఇప్పటికే 6 చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ల్యాండ్ మాఫియా కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార కేసులన్నీ భూకబ్జాదారులు వేసినవేనని ఆరోపిస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని.. ఆ కేసులన్నింటినీ చట్టపరంగానే ఎదుర్కొంటానని ఆయన అన్నారు. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది. హైడ్రా కమిషనర్‌గా దాదాపు రెండేళ్ల నుంచి కొనసాగుతూ వచ్చిన రంగనాథ్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే విషయంలో సస్పెన్స్‌గా మారింది.

## మామిడి వారి రజస్వల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం ధనుపురం గ్రామానికి చెందిన మామిడి మోహనరావు ు జమున దంపతుల కుమార్తె “హారిక” రజస్వల మహోత్సవంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు .ఆయనతోపాటు మండల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గున్నారు.

## గురు పౌర్ణమి వేడుకలకు ముస్తాబైన శ్రీ గురుదత్త సాయిబాబా ఆలయం



**ఎమ్మిగనూరు, జులై 28 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ గురుదత్త సాయిబాబా ఆలయంలో నేడు జరగనున్న గురు పౌర్ణమి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల రాకకు సర్వసిద్ధం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గురుపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం పురవీధుల గుండా పల్లకీ సేవ వైభవంగా సాగనుంది. కార్యక్రమం అనంతరం విచ్చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## వరుస ఇళ్ల చోరీల కేసులు ఛేదన.. నిందితుడి అరెస్ట్

**--రూ.10 లక్షల విలువైన 83 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం**



**కాకినాడ జిల్లా జూలై 28 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** జగ్గంపేట మండలంలోని రామవరం గ్రామంలో వరుస ఇళ్ల చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి,సుమారు రూ.10 లక్షల విలువైన 83 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు,అదనపు ఎస్పీ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో జగ్గంపేట పోలీసులు ఈ కేసును ఛేదించారు. జూలై 28న కాట్రావులపల్లి గ్రామం సమీపంలోని అమృత రెస్టారెంట్ ఎదురుగా రామవరం గ్రామానికి చెందిన భీమవరపు బాబ్జీ (35)ను అదుపులోకి తీసుకుని విచారించగా,తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి వివిధ కేసులకు సంబంధించిన రెండు బంగారు సూత్రాలు,కూనపూస,బంగారు నెక్లెస్,వెంకటేశ్వరస్వామి బిళ్లతో కూడిన గొలుసు, చెవిలీలు, బుట్టలు,బంగారు ఉంగరం,రెండు బంగారు గొలుసులు,లాకెట్‌తో కూడిన గొలుసు,రెండు బంగారు ఉంగరాలు కలిపి మొత్తం 83 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసిన జగ్గంపేట సీఐ బి తిరుపతిరావు, ఎస్ఐ టి రఘునాథరావు,దర్యాప్తు బృందాన్ని పెద్దాపురం డీఎస్పీ అభినందించారు.

## ఇంటింటికీ తెలుగుదేశం - ప్రజల ముంగిటకు కూటమి ప్రభుత్వం



**రామాపురం జూలై 28 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రామాపురం మండలం లో నీ సుద్దమల్ల గ్రామం ఓబుల్ రెడ్డి గారి పల్లి మరియు నల్లగుట్టపల్లి గ్రామాలలో రెండు సంవత్సరాల అభివృద్ధి సంక్షేమంపై కూటమి ప్రభుత్వం లో భాగంగా పోలింగ్ బూత్ నెంబర్ 43 కు కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి విజయాలను వివరించి వీటిని ప్రజల్లో తీసుకెళ్లాలని రామాపురం మండలం టీడీపీ అధ్యక్షులు గాలివీటి సురేంద్ర రెడ్డి మరియు క్లస్టర్ ఇంచార్జ్ పప్పిరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి సూచించారు. అలాగే గ్రామంలో నాయకులతో కలిసి కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దిరేవుల రమేష్ రెడ్డి ఆగ్రో వెంకటరామిరెడ్డి, ఐటీడీపీ నాగభూషణ్ రెడ్డి,గంప సుబ్బరాయుడు,పేయాల వెంకటసుబ్బయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,